ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
25 సెప్టెంబర్, 2011

Entered

నిజాలు కక్కించే 'నార్కో'

హ్యాపీ బర్త్‌డే

(2011 సెప్టెంబర్ 25 నుంచి 2011 అక్టోబర్ 1 వరకు)

ఆర్. హర్షిణి
1సం॥, సెప్టెంబర్-26
ఉమాదేవి-రాంబాబు
బమ్మెర-వరంగల్

టి.అక్షయ
2సం॥, సెప్టెంబర్-25
మీనా-వెంకటేశ్వరరావు
చెన్నారావుపాలెం-కృష్ణా

సాయి కీర్తన
4సం॥, సెప్టెంబర్-27
ఉషశ్రీ-కిరణ్‌కుమార్
ఖమ్మం

జ్యోతిర్మయి
2సం॥, సెప్టెంబర్-28
నాగమణి-నాగభూషణం
రాజమండ్రి

అభిలాష్
1సం॥,సెప్టెంబర్-2010
శివలీల-మల్లేష్
వికారాబాద్-రంగారెడ్డి

సిహెచ్. దినేష్
సెప్టెంబర్
సునీత-గోపి
మామిడికుదురు-తూ॥గో

జి. తేజస్వి- యశస్వి
సెప్టెంబర్
పుష్ప-చంద్రమౌళి
నూతన్‌కల్లు-నల్లగొండ

ఎం.శ్రీఆదర్శ
1సం॥, సెప్టెంబర్-25
శ్రావణి-రాజు
తాళ్లరేవు-తూ॥గో

కంగన
2సం॥,సెప్టెంబర్-2009
నీలిమ-దాసు
బాలానగర్-హైదరాబాద్

జస్వంత్
1సం॥, సెప్టెంబర్-2010
అంజమ్మ-శ్రీనివాస్
వికారాబాద్-రంగారెడ్డి

ఎం. చరణ్
1సం॥, సెప్టెంబర్-2010
జానకి-నాగేష్
వికారాబాద్-రంగారెడ్డి

కె. కేతన్ శ్రీ
1సం॥, అక్టోబర్-1
రామలక్ష్మి-రాము
ఆదిరెడ్డిపాలెం-విశాఖ

బి. చందన
4సం॥,సెప్టెంబర్-2007
చంద్రకళ-ప్రభాకర్
మర్పల్లి-రంగారెడ్డి

పి. ఇందు
7సం॥,సెప్టెంబర్-30
బుజ్జి-రామచంద్రరావు
పొడి-విజయనగరం

గౌతమ్ సాయి
1సం॥, సెప్టెంబర్-2010
హరిత-కేదారి
పరకాల-వరంగల్



సి.ముస్కాన్
2సం॥, సెప్టెంబర్-27
మొబినా-ఆరిఫ్‌ఖాన్
నెల్లూరు

మనలో మాట

ఖరీదైన నిరాహారం

ఇదో చిత్రవిచిత్ర విశ్వం. వింతలూ, విడ్డూరాలకు కొదవే వుండదు. ఆహారం కావాలన్నా పైసలు కావాలి. నిరాహారం వుండాలన్నా కాసులు కావాలి. కడుపుకు తిన్నా తినకున్నా ఖర్చు చేయాల్సిందేనా? ఇదెక్కడి చిక్కు అనిపిస్తుంది. ఎందాకో ఎందుకు! ఒక్క పొద్దు పద్దే చూద్దాం. విచిత్రంగా పస్తు వుంటే ఖర్చు తగ్గాల్సింది పోయి పెరుగుతుంది. మరి ఆ సాయంత్రం పళ్లూ పాలూ ఫలహారాలు మాత్రమే పుచ్చుకుంటే అంతే కధా. ఇది సామాన్యుల సంగతి. అదే స్వామీజీలు, మాతాజీలు, బాబాలకైతే వేల రూపాయల్లో ఖర్చవుతుంది.

పాలకవర్గ పార్టీల నాయకులే కనక నిరాహారం వుంటే అయ్యే ఖర్చు లక్షలు, కోట్లు. మరి వారి ఏర్పాట్లు మామూలుగా వుంటాయా! దీక్ష వేదిక కోసం స్థలం బుక్ చేయాలి. ఆకాశమంత పందిరి వేయాలి. నేలంతా పరుపులు పరవాలి. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, మైకులు, మీడియాకు మంచెలు ఎట్సెట్రా ఎట్సెట్రా కావాలి. స్టార్ ఆస్పత్రి వైద్యం అందుబాటులో వుండాలి. పత్రికల్లో, టీవీ చానళ్లలో ఫొటోలు ఇంటర్వ్యూలు వచ్చేలా చూసుకోవాలి. తోటి రాజకీయ నాయకులు, పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల నేతలు, కార్యకర్తలు వేలాదిగా వచ్చి పరామర్శించేలా ఫిక్స్ చేయాలి. భద్రత కోసం కంపెనీలకు కంపెనీలు బలగాలు కావాలి. ఆ పరిసరాల్లో పదే పదే ట్రాఫిక్ జామ్ గట్రా అయి వీరి దీక్ష గురించి చర్చించుకునేలా చూడాలి. పైగా పరామర్శించడానికి వచ్చేవారి స్వాగత సత్కారాలు, సాగనంపే ఏర్పాట్లు చూసుకోవాలి. ఇదంతా 'మామూలు' వ్యవహారమా!

తమిళనాట మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిగారు ఆరుబయట తల్పంగిల్పం వేయించుకొని, ఫ్యాన్లుఏసీలు పెట్టించుకొని దీక్ష చేయడం చూశాం. మన యోగా బాబా చేసిన దీక్షను ఎలా మరుస్తాం? పదివేల మందికి భోజనాలు పెట్టగలిగేంత పందిరి, ఎత్తైన వేదిక, మలయమారుతాలను అందించే విద్యుత్ పరికరాలు, వీడియోలు, కెమెరాలు...ఆ స్వాములోరి అట్టహాసమే వేరు.

ఇక అన్నా హజారే నిరాహారం వుంటే ఎంత హంగామా? ఎంత ప్రచారం? ఆ పదిరోజులూ ఆయన వేసిన ప్రతి అడుగునూ టీవీ చానళ్లు చూపించాయి. మొత్తమ్మీద ఆ ఏర్పాట్లన్నిటికీ మూడు పదులకుపైగా లకారాలు ఖర్చయ్యాయని పత్రికలు గోలపెట్టేశాయి. గుజరాత్ సీఎం నరేంద్రమోడీదైతే మరీ విడ్డూరం. ముచ్చటగా మూన్నాళ్లపాటు దీక్ష చేసినందుకు అక్షరాలా అరవై కోట్ల రూపాయలు ఖర్చయ్యాయట. అదీ సర్కారువారి డబ్బట. పస్తులుండే జనం కోసం ఖర్చు చేయని సర్కారువారు ముఖ్యమంత్రి పస్తును 'జయప్రదం' చేయడానికి రు.60 కోట్ల ప్రజల సొమ్మును ఉపయోగించడం ఎంత విడ్డూరం? తిండి తినకుండా వున్నందుకు రోజుకు 20 కోట్ల రూపాయల ఖర్చా! ★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	4
కథ	...	6
ఈ పేజ్	...	10
చూద్దామా	...	12
నవ్వుల్ పువ్వుల్	...	13
అట్టమీది కథ	...	14
చిన్నకథ	...	19
రుచి	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...



వికాసం ... 3

నవ్వు... ఏడుపు... ఆరోగ్యానికి మంచివే!

సినిమా కబుర్లు ... 8

వెండితెర సీతమ్మలు

ఎవరిగోల వారిదే ... 18

అమెరికాలో అవినీతి ఉండదా?



కొత్త పుస్తకాలు... 20

అశాస్త్రీయాంశాలపై అక్షర యుద్ధం



విభిన్న దృశ్యాలు

అట్టమీది కథ 'నిరాహార సమరం' నిజమైన నిరాహార ఉద్యమాల గురించి వివరంగా తెలియజేసింది. 'వికాసం'లో ఒత్తిడిని దూరం చేసుకోడానికి ఇచ్చిన సూచనలు ఆచరించే విధంగా ఉన్నాయి. 'కొత్తపుస్తకాల్లో' మంచి మంచి పుస్తకాలను పరిచయం చేస్తున్నారు. వెరైటీ'టీ' దృశ్యాలు విభిన్నంగా ఆకట్టుకున్నాయి. కవిత్వం పేజీ బాగుంటోంది. 'కొడుకుల్ బుట్టరటంచు' కథనందించిన రావుల కిరణ్మయికి అభినందనలు. 'సినిమా కబుర్లు' నాటి సినీ సంగతులను తెలియజేస్తున్నాయి. 'అందాల అండమాన్' ప్రత్యక్ష సందర్శన అనుభూతిని కలిగించింది. 'నవ్వుల్ పువ్వుల్' ఆహ్లాదపరిచింది. 'ఎవరిగోల వారిదే' బాగుంటోంది. మనలో మాట లో చెప్పినట్లు 'విశ్వాసం' అర్థం మారిపోతోంది. కుక్కలను చూసైనా విశ్వాసం నేర్చుకుంటే బాగుంటుందేమో?!

నేమాన సుభాష్‌చంద్రబోస్, శ్రీకాకుళం.

ప్రజల్లో చైతన్యం...

నిరాహార దీక్ష అనేది ఉద్యమ రూపం. అయితే దాని ద్వారానే సమస్యలు పరిష్కారం కావు. ఫలితంగా ఆందోళనా ఉద్యమాలు కొనసాగుతాయి. లాఠీచార్జీలు, పోలీస్ కాల్పులు, సహాయ నిరాకరణ సమ్మెలు కొనసాగుతాయి. ఆ క్రమంలో ప్రభుత్వం కొంతమేరకు దిగివస్తుంది. వర్గసమాజంలో సమస్యలు శాంతియుతంగా పరిష్కారం కావు. ప్రజల్లో చైతన్యం పెంపొందించడం కోసం మొదటి మెట్టుగా నిరాహార దీక్షలు చేపడుతుంటారు.

టి. శ్రీరామమూర్తి, విశాఖ.

ఆ ఒక్కటి చాలు

ట్రాఫిక్ లేదన్న ఒక్క విషయం చాలు అండమాన్ వెళ్లడానికి. భారతీయులు అధికంగా ఉన్న పోర్టుబ్లేయరు వీలుంటే చూడాలనుంది. నిరాహార దీక్షల్లో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, హజారే, రాఘవులు అగ్రస్థానంలో ఉంటారు. వెరైటీ'టీ'లు బాగున్నాయి. 'నవ్వుల్ పువ్వుల్' బాగుంటున్నాయి. 'మాటలకోట' ఆసక్తికరంగా ఉంటోంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

కుబేరులున్న పేదదేశం

ఆగస్టు 21 సంచికలోని అంబానీ ఇంటిని గురించి వ్యాసం 'అంబర చుంబిత సౌధం' చదువుతుంటే భారతదేశం కుబేరులున్న పేదదేశం అనేమాట నిజమేననిపిస్తుంది. విశ్వనాథ్ ఇంటర్వ్యూ చదువుతుంటే ఆయనతో మాట్లాడుతున్నట్లే ఉంది. నిజ జీవితంలో ఆలోచనలకు, నిద్రలోని కలలకు గల సంబంధాన్ని కథ రూపంలో తెలకపల్లి రవి అరటిపండు ఒలిచినట్లు చెప్పారు.

భైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

నవ్వులు పూయించాయి

అండమాన్ అందాలు బాగున్నాయి. కోరల్స్ దొరికే ప్రదేశం, స్వతంత్రకాలంలో తిరుగుబాటు దార్లను అతి దారుణంగా హింసించిన ప్రదేశం... ఇలా అనేక విషయాలు ఇందులో ప్రస్తావించారు. 'దిద్దుబాటు' కథ బాగుంది. 'నవ్వుల్ పువ్వుల్' ఇంటిల్లిపాదీ నవ్వులు పూయించాయి. 'సినిమా కబుర్ల' ద్వారా వెలుగులోకి రాని, తెలియని విషయాలెన్నో తెలుసుకున్నాం. 'మనలోమాట'లో చెప్పినట్లు నేటి మంత్రులు విశ్వాసం అన్న మాటకే విలువ లేకుండా చేస్తున్నారు.

పి.యాదగిరి, వరంగల్.



అందరి కోసం

'వలస బతుకులు, కొవ్వొత్తి' కవితలు బాగున్నాయి.'ఈ పేజ్' ద్వారా కంప్యూటర్ టెక్నాలజీకి సంబంధించి అనేక విషయాలు తెలియజేస్తున్నందుకు ధన్యవాదాలు. ఓ మంచి పని కోసం కొందరు చేసే నిరాహార దీక్షలు అనేకమందికి మేలు చేస్తాయి. అయితే నేడు నిరాహార దీక్షల పేరుతో కొంతమంది హంగామా సృష్టిస్తున్నారు. తమ పేరు కోసమో, పరపతి కోసమో వీటిని వాడుకుంటున్నారు. అనేక విషయాల సమాహారంగా 'నిరాహార సమరం' ఉంది. రెంటాల సినిమా వ్యాసాలు చదివిస్తున్నాయి.

ఎస్.రామారావు, శ్రీకాకుళం.





వినోదం



నవ్వు... ఏడుపు... ఆరోగ్యానికి మంచివే!

- సి.వి.సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

మనిషికి మాత్రమే చేతనైన విద్య నవ్వు. మనిషి ఆరోగ్యానికి నవ్వు మంచి సంకేతం. ఎదుటి వ్యక్తిని సంతోషంగా కలసినట్లు చెప్పగల ఏకైక శారీరక భాష. స్నేహితులను ఆత్మీయంగా దరిజేర్చగల ఒక మహత్తర ఆయుధం నవ్వు. పిల్లలు ఆడుకునేటప్పుడు ఇంగ్లీషులో అతి పొడవైన పదం చెప్పమని అడుగుతుంటారు. ఇంగ్లీషులో అతిపొడవైన పదం 'స్మైల్' అని చెబుతారు. ఎందుకంటే ఇందులో 'మైలు' ఉంది. నవ్వుకి విలువ కట్టడం ఎవరికీ సాధ్యం కాదు.

ఇది మనిషి నుండి శక్తిని విడుదల చేస్తుంది. ఇది విద్యుచ్ఛక్తి, అయస్కాంత శక్తి మాదిరి కంటికి కన్పించదు. ఈ శక్తి ఎదుటి మనిషి ప్రవర్తనపై తీవ్ర ప్రభావం చూపుతుంది. జంతువులకు నవ్వడం తెలీదు. 'సివంగి నవ్వు' గురించి చెబుతుంటారు. కానీ సివంగి ఎప్పుడూ నవ్వినట్లు కనిపించదు. రుచించని నవ్వును వ్యంగ్యంగా సివంగి నవ్వని అభివర్ణిస్తుంటారు. మనిషి నవ్వినప్పుడు తక్కువ సంఖ్యలో ముఖంలోని కండరాలు కదులుతాయి. కోపం వచ్చినప్పుడు ఎక్కువ కండరాలు కదులుతాయి. నవ్వు మనుషుల మధ్య ఉత్సాహాన్ని తెచ్చిపెడుతుంది. అనారోగ్యంతో ఉన్నవారు నవ్వుల హరివిల్లుతో ఆరోగ్య మందిరంలో ఉన్నట్లు అనుభూతి పొందుతారు. అప్పుడే పుట్టిన బిడ్డ ఏడుస్తుంది. అలా ఏడవకపోతే గిల్లి ఏడిపిస్తారు. బిడ్డ ఏడిస్తే అందరూ ఆనందపడతారు. ధైర్యంగా ఉంటారు. పుట్టిన బిడ్డకు మూడవ నెల వస్తేగాని నవ్వడం ప్రారంభించదు. అప్పుడప్పుడు బిడ్డ నిద్రలో తెలీకుండానే నవ్వుతుంది.

నవ్వు విశేషాలు

ప్రపంచంలో అద్భుతమైన పెయింటింగ్‌గా లియొనార్డో డావిన్సీ గీసిన 'మోనాలిసా పెయింటింగ్'ని చెబుతారు. నిగూఢమైన ఆమె నవ్వులోని అర్థాన్ని ఎవరూ చెప్పలేని కారణంగా ఆ పెయింటింగ్‌కు విశేషమైన ప్రాముఖ్యత వచ్చిందనీ చెప్పుకుంటారు.

పెళ్లికూతుర్ని చూడడానికి మగపెళ్లివారు వస్తారు. ఆ తర్వాత ఆమె ఇష్టాన్ని అడుగుతారు. చిరునవ్వు నవ్వితే ఆమెకు ఆ సంబంధం ఇష్టమని అర్థం. చిరునవ్వులో ఎంత అర్థముందో.

మేకప్ అంటే ఇష్టపడే ఆడవారికి చిరునవ్వుకు మించిన మేకప్ లేదని చెప్పాలి. కష్టాల్లో ఉన్నవారిచేత నవ్విస్తే కష్టాలన్నీ మర్చిపోతారు. నవ్వు అంటువ్యాధి లాంటిది. ఒకరు నవ్వితే మరొకరు నవ్వుతారు.

వ్యాపారంలో కష్టమర్లను నవ్వుతూ ఆహ్వానించి ఆకర్షించవచ్చు. వ్యాపారం అద్భుతంగా రాణించేటట్లు చేసుకోవచ్చు. కొంతమంది పని బాగానే చేస్తుంటారు. కానీ వారి ముఖాన నవ్వనేది వుండదు. అలాంటివారు ముఖంలో నవ్వు కన్పించేటట్లు ప్రవర్తిస్తే వారి పని మరింత రాణింపుకు వస్తుంది.

నవ్వడం రానివారికి నేర్పాలి. నవ్వు జీవిత మాధుర్యాన్ని ఎంతగానో పెంచుతుంది.

నవ్వు - ప్రయోజనాలు

★ నవ్వు మనిషి రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ★ శరీరంలోని ఆక్సిజన్ పరిమాణాన్ని పెంచుతుంది. ★ శరీరంలోని నొప్పులను మాయం చేయగల ఎండార్ఫాన్‌ను విడుదల చేస్తుంది. ★ మానసిక ఒత్తిడికి గొప్ప విరుగుడు నవ్వు. ★ మనిషి ఆత్మస్థయిర్యాన్ని పెంచి మానసిక సమతుల్యతను కాపాడుతుంది. ★ శారీరక అవయవాలు పుష్టిగా తయారవుతాయి. ★ ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ఇదొక మంచి వ్యాయామం. ★ నరాలు, రక్తనాళాలు ఒత్తిడి పొరలనుండి విముక్తి పొందుతాయి. ★ గుండె వేగం పెరగడం వల్ల చర్మం మీది స్వేద రంధ్రాలు తెరుచుకుంటాయి. ★ మనిషి రోగనిరోధక శక్తిని నవ్వు పెంచుతుంది.

ఆరోగ్యానికి ఏడుపు

♦ మనిషిలో విచారం, నిరాశ, నిస్పృహ వంటి వాటిని అణగదొక్కితే అనారోగ్యం మొదలవుతుంది. జీవితంలో ఏదో ఒక సమయంలో ఏడవని మనిషి ఉండడు. ♦ స్తన్య జంతువుల్లో పుట్టగానే ఏడ్చేది మనిషి ఒక్కడే. ఆ తర్వాత జీవితంలో ఒత్తిడులు, బాధలు మనిషిని ఏడ్చేట్టు చేస్తాయి. ♦ సాంఘిక జీవనం, ప్రవర్తనా పద్ధతులు, అహంకారం, సిగ్గు వంటివి మనిషి ఏడుపుకు ఆనకట్ట వేస్తున్నాయి. ♦ ఏడుపనేది ఆడవారి సొత్తు అని జనాభిప్రాయం. నిజానికి వారికి ఓర్పు ఎక్కువ. ఆరోగ్యంగా ఉంటారు. ఎక్కువ కాలం జీవిస్తారు. ♦ కంట తడి పెట్టడం, బిగ్గరగా ఏడవడం, కావలసినప్పుడు ఆపేయడం ఆడవారికే సాధ్యం. ఇవి వారి ఆరోగ్య పరిరక్షణలో ముఖ్య పాత్ర వహిస్తాయి. ♦ మనిషి వికృత భావావేశాలకు లోనయినప్పుడు, వాటి ఒత్తిడి నుండి బయటపడేందుకు ఏడుపు ఒక మార్గం.

ఏడుపు వల్ల లాభాలు

★ మనిషి విషాదభరితమైన, దుఃఖపూరితమైన ఆవేశాలకు లోనైనప్పుడు శరీరంలో విషపదార్థాలు పుడతాయి. వీటిని శరీరం నుండి విసర్జించడానికి ఏడుపు ఎంతో సహకరిస్తుంది. ★ విచారంలో ఉన్న మనిషి ఏడిస్తే కొంత ఉపశమనం లభిస్తుంది. ★ సహాయం చేయమని సూటిగా అడిగే సంకేతం 'ఏడుపు'. ఇది సహాయం అవసరమని తెలియజేసే ఒక పిలుపు. ★ ఏడుపు అనేది ఒక కమ్యూనికేషన్ పద్ధతి. మాటలతో చెప్పలేని భావాలు ఏడుపు ద్వారా చెప్పడం సాధ్యమౌతుంది. ★ మనిషి హృదయానికి కిటికీలు వంటివి కళ్లు. హృదయంలోని ఆవేదనకు ప్రతిరూపంగా కన్నీళ్లు కారతాయి. ★ పిల్లలు నిరాశకు గురైనప్పుడు పెద్దల దృష్టిని ఆకర్షించేందుకు ఏడుస్తారు. ★ ఏడుపు ఒత్తిడి నుండి విముక్తి కలిగిస్తుంది. ★ మెదడు, గుండె తేలికై మనిషి ఆలోచనా శక్తిని యథా స్థితికి తెస్తుంది. ★ మనిషి ఏడవకపోతే హాయిగా ఉండలేడు. ఏడుపును బట్టి మనిషిలోని దుఃఖాన్ని సులువుగా అంచనా వేయవచ్చు. ★ ఏడవకుండా ఉండడం వల్ల శరీరాన్ని అనారోగ్యం వైపు తరలిస్తున్నాడని మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయం.

మరువకూడదు

♦ భావావేశం వల్ల వచ్చే ఏడుపుకు, ఇతరుల సానుభూతి పొందేందుకు ఏడ్చే ఏడుపుకు చాలా తేడా ఉంటుంది. ఇతరులు ఈ విషయాన్ని సులువుగా పసిగట్టగలరు. ♦ తన అనుభవంలో వచ్చే అనేక విషయాలను తట్టుకుని వాటిని మనసులో దాచుకుని బయటికి గంభీరంగా కన్పించే మనిషి లోపల ఉన్న అగ్ని పర్వతాల పేలుళ్ల కు ఎప్పుడో ఒకప్పుడు జవాబు చెప్పాల్సి వస్తుంది. ♦ దెబ్బ తగిలినప్పుడు కూడా భయం, ఆత్రుత, నొప్పి, కోపం వంటి వాటిని కొంతమంది అణగదొక్కుతున్నారు. ఇటువంటి ఒత్తిడి వల్ల క్రమంగా ఆరోగ్యం దెబ్బతింటుంది. ♦ నిస్పృహతో ఉన్న వ్యక్తులు ఏడవకపోతే ప్రమాదం.

★

ఎత్తరా ఎర్రెర్రని జెండా

ఎత్తరా, పైకెత్తరా
కార్మిక జనాల గుండెల నిండుగ
ధైర్యము నింపే ఎర్రని జెండా
ఎర్రెర్రని జండా ఎత్తరా!
సేద్యం చేసి చెమటలు కార్చి
జనాల పొట్టలు నింపుతూ
తాను పస్తులు పండుతూ
ఉసూరుమని ఊరటపొందే
కర్షక గుండెల ధైర్యం నింపే
ఎర్రెర్రని జెండా ఎత్తరా
రాత్రి పగలని భేదం లేక
పనుల్లో మునిగి తేలుతూ
అరకొరగ అందిన కూలిడబ్బుతో
కాళ్లీడ్చుకు ఇళ్లకు చేరే
కూలి బతుకుల ధైర్యం నింపే
ఎర్రెర్రని జెండా ఎత్తరా!
ఎంత తపించినా తిండికి చాలని
చిరువేతనాలతో గ్రామసేవలో
బండ చాకిరితో, వీధులు ఊడ్చి
మురికి కాలువల చేతులనెత్త
జనాల ఆరోగ్యం కొరకై
తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టే దీనుల
మదిలో, ధైర్యం నింపే
ఎర్రెర్రని జెండా ఎత్తరా!
పుట్టిన ఊరు, పెరిగిన ఇల్లు
కలల్లో కంటూ వలసల బాటన
పల్లెలనొదలి పట్టణాల దారుల బట్టి
చెట్లకింద, రోడ్ల పక్కన గుడిసెల్లో
కాపురాలతో
కూలి దొరక్క పస్తులు పండే
అనాథ జీవుల కండగ నిలిచే
ఎర్రెర్రని జెండా ఎత్తరా!
సమాన శ్రమతో
సమాన జీవన భృతితో
కులమతాల అస్తిత్వం కాదని
శ్రమైక జీవన సౌందర్యం
తన బాటని చాటే
ఎర్రెర్రని జెండా ఎత్తరా!
ఆడ మగ అందరూ సమానమని
హెచ్చు తగ్గులకు తావే లేదని
పండించిన ప్రతి పంటా శ్రామికులందరి
సమిష్టి కృషియని చాటే
ఎర్రెర్రని జెండా ఎత్తరా!

- రామిసెట్టి రోశయ్య

కవిత్వమ్

యుద్ధం

శాంతి స్థాపన కోసం యుద్ధమనేది
ఒక శుద్ధ అబద్ధం
యుద్ధం...
మనిషిని మనిషిగా చూడలేని
మానసిక అంధత్వం
భావ భేదమును సరిచేయలేని
ఆటవిక పశుత్వం
జాతిని జాతి దోచుకు తినే
ఆర్థిక రాక్షసత్వం
హక్కుల పరిరక్షణకే యుద్ధమనేది
ఒక అందమైన ముసుగు
హక్కుల హరణం
మానవ హననమే దాని ధ్యేయం
శిధిల జీవుల సమాధులపైన
పగిలిన ఎడారి హృదయాలపైన
సామ్రాజ్యవాదుల కత్తులు చెక్కిన
నెత్తుటి చిత్రమే
ఈ యుద్ధం.

- పెద్దిపాగ పున్నారావు

పల్లెజనం



సూర్యోదయం కన్నా ముందే
బతుకు పుస్తకాల్ని తెరిచి
రోజుకో పేజీలో
అనుభవాల అక్షరాల్ని
కాల కలంతో రాసుకునే
మట్టి మనుషులు!
భూమి, ఆకాశం
శ్రమ, చెమట
ఎండా, వాన
పంట, కరువు
అప్పు, దప్పులు తప్ప
మరే పదాలకు అర్థాలు తెలియని
అమాయకులు!
కష్టమొచ్చినా, నష్టమొచ్చినా
మొక్కవోని ధైర్యంతో
ముందుకు సాగిపోయే
ఆశావహులు!
తోటివారికి నీడనివ్వడానికి
చేయూతనిచ్చి ఆదుకోడానికి
ముందడుగు వేసే మంచి
మనుషులు!
సాయం సమయంలో
రచ్చబండ వేదిక మీద
యోగక్షేమాలు చర్చించుకునే
సమిష్టి సంఘజీవులు!
నావాళ్ల మధ్య నేను తిరుగుతుంటే
కొండంత ధైర్యం గుండెల్లో నిండి
అమ్మ గర్భంలో ఉన్నట్లుంటుంది!

- పి. లక్ష్మణ్‌రావు

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
0-9789099589

హాలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside: Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near: Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex, D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239, 99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709, 92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

కథ

"అజాద్! ఎవరో తలుపు కొడుతున్నారు చూడు"

"ఏంటి సమతా? ఇంత రాత్రి వేళ తలుపుకొట్టడానికి ఇక్కడ మనకెవరు తెలుసని?"

"అయినా ఒకసారి చూడు ఎవరో?"

కళ్ల నలుపుకుంటూ తలుపు తీస్తే ఎదురుగా పోలీస్ కానిస్టేబుల్.

"ఏంటి అరగంట నుండి తలుపుకొడుతుంటే తీయకుండా ఏం చేస్తున్నారు?" అంటూ విసురుగా లోపలికి వచ్చాడు.

పోలీసును చూచేసరికి ఏం అర్థం కాలేదు అజాద్‌కి. బిక్కముఖం వేసుకుని చూస్తూ నిల్చున్నాడు.

"మాట్లాడుతుంటే వులకవు, పలకవేంటి? ఇంతకీ నీ పేరేంటి?"

"అజాద్"

"మరి నీపేరు?" ఆమె వైపు తిరిగి అడిగాడు కానిస్టేబుల్.

"సమత"

"లేచిపోయి వచ్చిన కేసా?'

"అదేం కాదు" సమత విసురుగా సమాధానం చెప్పింది.

"ఎలా నమ్మడం?" కానిస్టేబుల్ రెట్టించి అడిగాడు.

"మాకు పెళ్లయి ఆర్నెల్లయింది" అన్నాడు అజాద్.

"మరైతే లాడ్జింగుకు ఎందుకొచ్చినట్లు?" అడిగాడు పోలీస్.

"ఆమెకి ఈ ఊర్లో రేపు ఇంటర్వ్యూ ఉందండి" చెప్పాడు అజాద్.

"ఓహో, చదువుకున్న కేసా? నమ్మే విషయమేనా ఇది? ఇంతకీ ఇంటర్వ్యూ ఎక్కడ? పెళ్లయిన గుర్తులు కూడా లేవు" ఆమె వైపు అనుమానంగా చూస్తూ అన్నాడా కానిస్టేబుల్.

"మాది మతాంతర వివాహం" చెప్పాడు అజాద్.

"బిల్డప్ బాగానే ఉంది. ఆదర్శ పెళ్లిళ్ల చేసుకున్నవాళ్లు ఎంతమంది తాళిబొట్టు వేసుకుని, మెట్టెలు పెట్టుకోవడం లేదు?" రెట్టించాడు కానిస్టేబుల్.

"మా ఇద్దరికీ ఇలాంటివి ఇష్టం లేవండి" అంది సమత.

"అయితే మిమ్మల్ని అనుమానించాల్సిందే. లాభం లేదు, పదండి పోలీస్‌స్టేషన్‌కి" అన్నాడు కానిస్టేబుల్.

పంట మొక్కలు

"ఎందుకు రావాలి?" సమత గట్టిగా అడిగింది.

"ఎందుకా? మినిస్టర్ కూతురు ఎవరినో ప్రేమించి వెళ్లిపోయింది. వాళ్లని వెతుకుతుంటే మీరు దొరికారు. ముందు స్టేషన్‌కి నడవండి. అక్కడ తెలుస్తుంది" అన్నాడు కానిస్టేబుల్.

"సార్ మేమేతప్పూ చేయలేదు. వదిలేయండి సార్" ప్రాధేయపడ్డాడు అజాద్.

"కుదరదు. స్టేషన్‌కి రావాల్సిందే" కానిస్టేబుల్ పట్టుబట్టాడు.

"అసలెందుకు రావాలి?" సమత గట్టిగా అడిగింది.

"ఎందుకు రావాలో స్టేషన్‌కి వస్తే కదా తెలిసేది" గదమాయించాడా కానిస్టేబుల్.

"సార్! రేపు ఉదయాన్నే ఇంటర్వ్యూకి వెళ్లాలి. ఈ ఉద్యోగం మాకు చాలా అవసరం. దీంతో మా కష్టాలన్నీ తీరతాయి సార్" అజాద్ బతిమాలాడు.

"చూడు... ఇవన్నీ స్టేషన్‌కి వచ్చి ఎస్.ఐకి చెప్పు. ఆయన ఓకే అంటే వదిలేస్తాం. సరేనా" చెప్పాడు కానిస్టేబుల్..

"ఇదిగోండి నా ఇంటర్వ్యూ కాల్ లెటర్" అంటూ కానిస్టేబుల్ చేతికిచ్చింది సమత.

"అబ్బో! చాలా రోషముందే. నీ ఇంటర్వ్యూ లెటర్ గురించి నేనడగలేదే. అందులో ఏమైనా మీరిద్దరూ భార్యాభర్తలని రాసుందా? ఇంటర్వ్యూలకి బోయ్‌ఫ్రెండ్‌తో కూడా రావచ్చు" వంకరగా నవ్వుతూ అన్నాడా కానిస్టేబుల్.

"ఇందాకట్నుండి చూస్తున్నాం. మమ్మల్ని నేరస్తుల్లా చూస్తున్నారు. పెద్దల సమక్షంలోనే మా పెళ్లి జరిగిందండి" అజాద్ నచ్చజెప్పబోయాడు.

"ఇవన్నీ స్టేషన్‌కి వచ్చి చెప్పుకో. పదండి" అన్నాడు కానిస్టేబుల్.

"ఇంత రాత్రి పూట ఆడవాళ్లను స్టేషన్‌కి ఎలా తీసుకెళ్తారు?" అడిగాడు అజాద్.

"రూల్స్ బాగానే మాట్లాడుతున్నావ్!. ఇలాంటి ఆడోళ్లని తీసుకెళ్లొచ్చులే. మా రూల్స్ మాకుంటాయి. పదండి... పదండి... మీ సంగతేంటో తేల్చుకోవాలి" తొందర పెట్టాడు.

"మీరు కొంచెం బయటికెళ్తే బట్టలు మార్చుకుని వస్తాం" చెప్పాడు అజాద్.

◆◆◆

స్టేషన్‌కి వచ్చిన ఇద్దరికీ అక్కడి పరిస్థితి గందరగోళంగా ఉంది. దాదాపు పది జంటలున్నాయి అక్కడ. ఎస్.ఐ ఒక్కొక్కళ్లను పిలిచి మాట్లాడుతున్నాడు. ఇంతలో వీళ్ల వంతు వచ్చింది.

"సార్! వీళ్లు రమ్య లాడ్జ్‌లో దొరికారు. ఈ అమ్మాయికి చాలా తలబిరుసు. రూల్సన్నీ మాట్లాడుతుంది" అంటూ కానిస్టేబుల్ ఎస్.ఐ చెవిలో చెప్పాడు.

"ఏంటి. లేచిపోయి వచ్చిన కేసా?" ప్రశ్నించాడు ఎస్.ఐ.

"అదేం కాదు సార్. మేమిద్దరం భార్యాభర్తలం" చెప్పాడు అజాద్.

"సార్! అతని పేరు అజాద్, ఆ అమ్మాయి పేరు సమత" కానిస్టేబుల్ మళ్లీ అందుకున్నాడు.

"ఏంటి లవ్ మ్యారేజా?" అడిగాడు ఎస్.ఐ.

"అవును సార్. ఇద్దరం చదువుకునే రోజుల్లో ప్రేమించుకున్నాం. ఈ మధ్యనే పెళ్లి చేసుకున్నాం" అజాద్ చెప్పాడు.

"నమ్మేలా వుందా? ఈ అమ్మాయిని ఒక్కసారి చూడండి సార్. అసలు పెళ్లి కళ కనపడుతుందా చెప్పండి?" కానిస్టేబుల్ మళ్లీ మధ్యలో దూరి మాట్లాడుతున్నాడు.

"నువ్వు ఆవేశపడకు. నేను చూసుకుంటాలే" సర్ది చెప్పాడు ఎస్.ఐ.

"చూడయ్యా. ప్రేమించిన వాళ్లైనా ఏదో ఒక పద్ధతిలో పెళ్లి చేసుకుంటారు. ఆదర్శ వివాహం చేసుకున్నవాళ్లైనా తొంభైతొమ్మిది శాతం భర్త సాంప్రదాయం ప్రకారం ఉంటారు. మరి

సాయిబులబ్బాయివి కదా. ఆ అమ్మాయిని నిఖా చేసుకోలేదా?" అడిగాడు ఎస్.ఐ.

"లేదు సార్. మేం ఏ మత సాంప్రదాయమూ వద్దనుకున్నాం" చెప్పాడు అజాద్.

'అహా! మంచి ఆదర్శమే...' వంకరగా నవ్వాడు ఎస్.ఐ.

"అదేంటండీ అలా అంటారు? సమసమాజ స్థాపనకు పునాదులు వేసి కులరహిత సమాజం అవసరమని, కుల, మతాంతర వివాహాలు చేసుకోవాలని డా॥బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు కదండి. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని కులమత, సాంప్రదాయాలను, కట్టుబాట్లను ఛేదించాలనుకున్నాం. మంచితనం, నిజాయితీ ఉండాలి కానీ ఇలాంటివి కాదు కద సార్" అంది సమత.

"చూడండి సార్. ఆ అమ్మాయి ఎలా పొగరుగా మాట్లాడుతుందో. మీరు కమ్యూనిస్టులా?" అన్నాడు కానిస్టేబుల్.

"కమ్యూనిస్టులైతే ఇలా వుండొచ్చని రూలుందా సార్?" సమత ఎదురు ప్రశ్నించింది.

"అటు కమ్యూనిస్టులూ కాదు, ఇటు సాంప్రదాయమూ లేదు. మిమ్మల్ని ఏమనుకోవాలి?" అన్నాడు ఎస్.ఐ.

"ఆదర్శవాదులం సార్. కులం, మతం, సాంప్రదాయం అనేవి భారత రాజ్యాంగం వ్యక్తిగతం సార్. ఎలా ఉండాలనే స్వేచ్ఛ అందిరికీ ఉంది" కాస్త గట్టిగానే సమాధానమిచ్చాడు అజాద్.

"సార్! వీళ్లను చూస్తుంటే అనుమానంగా ఉంది. ఖచ్చితంగా ఈ అమ్మాయి మార్కిస్టు, ఆ అబ్బాయి టెర్రరిస్టులా ఉన్నారు. వీళ్లకి అంతర్జాతీయ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లున్నాయి. ఏదో కుట్ర పన్ని ఉంటారు. అందుకే భార్యాభర్తలుగా నటిస్తూ నమ్మిస్తున్నారు" అన్నాడు కానిస్టేబుల్.

'మా నాన్న నెత్తీనోరు మొత్తుకున్నాడు. చూస్తూ చూస్తూ వేరే కులం అబ్బాయిని పెళ్లి చేసుకుంటున్నావు. తర్వాత చాలా సమస్యలు వస్తాయి. ఇక నీ ఇష్టం. నీ ఖర్మకు నువ్వే బాధ్యురాలివి' అన్నాడు. పెద్దల మాట చద్దిమూట అని ఊరికే అనలేదు. ఈ దేశంలో ముస్లిములందర్నీ టెర్రరిస్టులుగా చూడ్డం మామూలైనట్లుంది. ప్రశ్నించేవాళ్లందరూ మార్కిస్టులైపోయారు. ఖర్మ... దేశం ఇలా తయారైనందుకు నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కావట్లేదు. అయినా ఇంత చిన్న విషయానికే భయపడితే ఎలా? జీవితం చాలా పెద్దది' అని తనకు తాను నచ్చజెప్పుకుంది

"ఈ ఊళ్లో మీకు తెలిసిన వాళ్లెవరైనా వచ్చి మీరు భార్యాభర్తలని చెప్తే వదిలేస్తాం" చెప్పాడు ఎస్.ఐ.

"ఎవరూ లేరు సార్. ఈ ఊరికి రావడం

ఇదే మొదటి సారి" చెప్పాడు అజాద్.

"అయితే ఓ పనిచెయ్యి. ఈ అమ్మాయి తరుపువాళ్లు వచ్చి చెప్తే వదిలేస్తాం" అన్నాడు ఎస్.ఐ.

భలే ఫిట్టింగు పెట్టాడే ఈ ఎస్.ఐ. అసలే మతాంతర వివాహం చేకున్నానని నాన్న తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. పరువు బజారుకీడ్చానని బయటికి గెంటేశాడు. ఇప్పుడెలా? అనుకుంది సమత.

"సార్! మా పెళ్లి సమత వాళ్ల నాన్నగారికి ఇష్టం లేదు. అందుకే కూతురు చనిపోయిందని ఖర్మకాండలు కూడా పెట్టాడు. వాళ్లు మా ముఖం చూడరు. తెల్లారిపోతుంది. త్వరగా ఇంటర్వ్యూకి వెళ్లాలి. మమ్మల్ని వదిలేయండి సార్" బతిమాలుకున్నాడు అజాద్.

"అయితే ఒక పనిచెయ్యి. మీ వాళ్లతో మాట్లాడించు" అడిగాడు ఎస్.ఐ.

"సమత వాళ్లనాన్నగారి కన్నా, మా వాళ్లు ఇంకా మూర్ఖులు. నా పెళ్లికి కట్న కానుకలు రాలేదని నా ముఖం కూడా చూడ్డం లేదు. వాళ్లూ మమ్మల్ని దగ్గరికి రానీయమని పట్టుబట్టారు" చెప్పాడు అజాద్.

"ఏంటయ్యా ఇది? అంతా తికమకగా ఉంది. మీ పరిస్థితేంటి? ప్రేమంటారు, ఆదర్శమంటారు, ఇద్దరిళ్లలోనూ ఇష్టం లేదంటారు. పోనీ రిజిస్టరు మ్యారేజీ చేసుకున్నారా? రుజువులున్నాయా? ఈ క్షణమే వదిలేస్తాను" అడిగాడు ఎస్.ఐ.

"అదేంటి సార్. మేమిద్దరం మేజర్లం. ఇష్టపడి పెళ్లి చేసుకున్నాం. కలిసి బతకాలనుకున్నాం. ఇది చాలదా. అవన్నీ అవసరమా?" అన్నాడు అజాద్.

"అవసరమేనయ్యా. ప్రేమపెళ్లిళ్లు చాలా వరకు విఫలమౌతాయి. నూటికో, కోటికో ఒకటి రెండు నిలబడతాయి. మీలాంటి వాళ్లను నా సర్వీసులో చాలా మందిని చూశాను. మీకు పెళ్లైనట్లు ఆధారాలు లేకపోతే ఎలా? రేపు ఏదైనా సమస్య వచ్చి విడిపోవాలనుకున్నా సాక్ష్యాలు కావాలిగా" అన్నాడు ఎస్.ఐ.

"ఆ అవసరం మాకు లేదు సార్. కలిసి ఉండాలనుకున్నా, విడిపోవాలనుకున్నా మా ఇద్దరి ఇష్టాఇష్టాలు చాలు" అంటూ సమత ఆవేశంగా సమాధానమిచ్చింది.

"అది కాదమ్మా! రేపెప్పుడైనా మీరిద్దరి మధ్య సమస్యలొచ్చి విడాకులు తీసుకోవాలనుకున్నా, అతన్నుండి భరణం పొందాలన్నా ఇవన్నీ అవసరం కదా" ఎస్.ఐ అడిగాడు.

"ఆ అవసరం లేదు సార్. అవన్నీ ఆర్థిక సంబంధాలు. అవే మనిషిని రాజీపడి బతకమని శాసిస్తున్నాయ్. అందుకే చాలామంది తమ ఇష్టాఇష్టాలతో పనిలేకుండా బలవంతపు జీవితాలు సాగిస్తున్నారు. నేను చదువుకున్నా. అతనితో సమానంగా సంపాదిస్తా. ఆర్థిక వెసులుబాటు కోసం ఇవన్నీ అవసరం. ఎవరి కాళ్లమీద వాళ్లు నిలబడితే రాజీపడి బతికే అవసరం ఉండదు. కాపురం చేసేది డబ్బుకోసం కాదు సార్, ఒకరికొకరు తోడుండడానికి. విడాకుల వల్ల పిల్లల భవిష్యత్తు పాడైపోతుంది. అంతేకాకుండా సమాజం మీద నెగిటివ్ ప్రభావం ఉంటుంది. అసలు విడాకులు తీసుకోవడమంటే నా దృష్టిలో సమస్యల నుండి తప్పించుకుని పారిపోవడమే. నిజానికి కలిసి జీవించడంలోనే పెద్ద పోరాటముంది. ఆ పోరాటంలో గెలవలేక పారిపోయేవారికి విడాకులు ఒక ఆయుధం" అంది సమత.

"మీ ఇద్దర్నీ చూస్తుంటే ఆశ్చర్యంగానూ, సంతోషంగానూ ఉంది. ఇంతకీ మీకు పెళ్లైందో లేదో ఎవరితోనైనా చెప్పించి పుణ్యం కట్టుకోండి బాబూ" చివరికి బతిమాలుకున్నాడు ఎస్.ఐ.

ఈ మాటలతో ఇద్దరూ ఆనందంతో ఒక్కసారిగా "మేం పెళ్లి చేసుకుంది మా ఊరి పోలీస్ స్టేషన్లో సార్. కావాలంటే కనుక్కోండి" అన్నారు.

ఎస్.ఐ వెంటనే ఆ వూరి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి మొత్తం వివరాలు కనుక్కున్నాడు. అవతలి వాళ్ల సమాధానంతో సంతృప్తిపడి "ముందే చెప్పొచ్చు కదా. మా వాళ్లే పెళ్లి చేశారని" అన్నాడు

"అదేంటి సార్. మాకా అవకాశాన్ని ఇచ్చారా మీరు. ఏవేవో ప్రశ్నలు వేసి తికమక పెట్టారు" అన్నారు.

వాళ్లిద్దర్నీ వాళ్ల రూం దగ్గర దింపి రమ్మని కానిస్టేబుల్‌ని పిలిచి చెప్పాడు ఎస్.ఐ.

అజాద్, సమత థ్యాంక్స్ చెప్పి బయల్దేరారు.

వాళ్లిద్దర్నీ చూస్తూ 'కలుపు మొక్కల్ని పీకేయాలనుకుని పంట మొక్కల్ని పీకేస్తే మనమేగా నష్టపోయేది' అనుకున్నాడు ఎస్.ఐ.

- పి. రాజ్యలక్ష్మి

వెండి తెర సీతమ్మలు

రామాయణాన్ని సీతాయణంగా చెబుతుంటాడు మల్లాది రామకృష్ణశాస్త్రి నవల కృష్ణాతీరంలో హరికథకుడు. ఏమంటే రాముడి కథ మొత్తం సీత కథే. సీతమ్మోరి చెరలన్న మాట అలాగే పుట్టింది. సాధ్వీ లలామగా సాత్విక మూర్తిగా మాత్రమే జనహృదయాల్లో హత్తుకు పోయిన సీత నిజానికి దేవతగా కన్నా స్త్రీ లోకపు బాధలకు ప్రతినిధిగా ఎక్కువగా జనానికి తెలుసు. ఆ సంగతులు అలా వుంచితే వెండి తెర రామాయణాల్లో సీత పాత్ర ఎలా మలచబడిందీ, ఏఏ నటీమణులు ఆ పాత్రను ఎలా పోషించారు అన్నది ఆసక్తిగొల్పుతుంది. రామదాసుడుగా తనను తాను అభివర్ణించుకునే బాపు నిర్దేశకత్వంలో రామరాజ్యం విడుదలవుతున్న తరుణంలో ఆ ముచ్చట్లు ఒక్కసారి....

ఇప్పటివరకూ తెలుగువారికి సీత అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది అంజలీదేవి. లవకుశ చిత్రంలో ఎన్టీఆర్ సరసన సీతగా ఆమె ప్రేక్షక జనాన్ని అమోఘంగా ఆకట్టుకున్నారు. లవకుశ సహజంగా రాముడికన్నా ఆ తల్లీ పిల్లల చుట్టూనే ఎక్కువగా తిరుగుతుంది. ఆజానుబాహుం అరవింద దళయాతాక్షం అన్నట్టు వున్న తారక రామారావు పక్కన సీతా మహాసాధ్విగా అంజలీ దేవి అక్షరాలా అమరిపోయారు. రాముడిని అయోధ్యకు స్వాగతించడంతో మొదలయ్యే ఆ కథ కొద్దిలోనే రజకుడి మాటలతో మలుపు తిరుగుతుంది. ఇక్కడ రజకుడు కేవలం సాకు మాత్రమే. అంతకు ముందే అనవసరంగా ఆర్యపుత్రుల అనుమాన భూత నివారణ కోసం అగ్ని ప్రవేశం చేసిన సీతను పరిత్యజించడానికి రాజుగా రాముడు ఆ మాటలకు విలువ నిచ్చాడు. అగ్ని పునీత సీతను చెప్పకుండా అడవులకు పంపించాడు. అయితే గర్భవతిగా వున్న సీత అంతకు ముందెన్నడో అడవులను చూసి రావాలని వెలిబుచ్చిన కొర్కెను అడ్డుపెట్టుకుని అమెకు చెప్పకుండా లక్ష్మణుడికి మాత్రం చెప్పి పంపించాడు. నిజం తెలియని సీతకు మొదట అమితానందం తర్వాత ఆవేదనా ముప్పిరిగొంటాయి. వీటన్నిటినీ అంజలీ దేవి చాలా బాగా రక్తి కట్టించారు. వాల్మీకి ఆశ్రమంలో పిల్లలను కనిపెంచే మాతృమూర్తిగా వారు రామ సంకీర్తనలు ఆలపిస్తుంటే ఆనందంతో పాటు ఆవేదనను కూడా అనుభవిస్తూ తనలోనే దాచుకుంటూ కాలం గడుపుతుంది. అయోధ్య వెళ్లి వచ్చిన లవకుశులు సీతను రాముడు అడవులకు పంపిన సంగతి తెలుసుకుని, ఆమె తమ తల్లే అని తెలియక రాముడిపై నిప్పులు కక్కుతుంటే వారిని మందలించే సన్నివేశంలో ఆమె నటన అద్భుతం. రాముడు అశ్వమేధ యాగం చేస్తున్నాడంటే మరో పెళ్లి చేసుకున్నాడా అని ఆమెకు సందేహం కలగడం, వాల్మీకి తన మహిమతో నివృత్తి చేయడం ఇంకో రసవత్తర సన్నివేశం. నిజానికి అనుమానానికి అనేక సార్లు గురైన సీతకు అనుమానాన్ని ఆపాదించి సందేహించకుమమ్మా, రఘు రాము ప్రేమను సీతమ్మా అని పాడించడం ఒక విచిత్రం. చివరకు లవకుశులు రాముడితో తలపడటం, ఆమె మధ్యలో తెలసి వచ్చి నివారించడం జరుగుతుంది. ఇదంతా అయిన తర్వాత పిల్లలను రాముడికి అప్పగించి తను తల్లి భూదేవి ఒడిలోకి వెళ్లిపోవడం సీత చేసిన తిరుగుబాటు. అయోధ్య ప్రవేశం నుంచి భూ గర్భ యానం వరకూ లవకుశలో అంజలీ దేవి అభినయం ఈమే సీత అనిపిస్తుంది.

మంచి ఆదరణ పొందిన వీరాంజనేయ చిత్రంలోనూ ఆంజలీ దేవి సీతగా కనిపిస్తారు. సీతకు కొనసాగింపుగా కృష్ణావతారంలో రుక్మిణి పాత్రకు కూడా ఆమె ఖాయమై పోయారు. ఉత్తరోత్తరా సక్కుబాయి వంటి పాత్రలను కూడా అంజలీ దేవినే ప్రేక్షకులు ఆమోదించారు. అంజలి మంచి తల్లిగా, ఉత్తమ ఇల్లాలుగా కుటుంబ పెద్దగా అనేకపాత్రలు ధరించడానికి పునాది లవకుశ సీతతోనే.

తర్వాత చెప్పుకోవలసింది ఎన్టీఆర్ దర్శకత్వంలో తయారైన 'సీతారామ కళ్యాణం'. నిజానికి ఈ చిత్రంలో రామారావు రావణాసురుడి పాత్ర ధరించడంతో ఆయనకు ప్రాధాన్యత చాలా ఎక్కువగా వుంటుంది. అయినా రాముడిగా హరనాథ్, సీతగా గీతాంజలి చాలా సుకుమార సుందరంగా కనిపిస్తారు. అయోనిజగా భూమి దున్నేప్పుడు సీత లభించడం నుంచి ఆమెను రాముడు పెళ్లాడే వరకూ చిత్రం నడుస్తుంది. శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండి అన్న టైటిల్ పాట తెలుగు నాట నిత్య నూతనంగా వినిపిస్తుంటుంది. ఇంతకూ గీతాంజలి తర్వాతి రోజుల్లో హాస్యనటిగా స్థిరపడింది గాని ఈ చిత్రంలో ఆమె చాలా అందంగా కళాత్మకంగా వుంటుంది. అయితే తర్వాత ఎప్పుడూ ఆమె సీతగా కనిపించినట్టు లేదు.

తర్వాత కాలంలో దేవిక ఆమెకు వారసురాలైంది. సత్యభామగా ఎవరు వేసినా రుక్మిణిగా మాత్రం అంజలీ లేదా దేవిక మాత్రమే ఎన్టీఆర్ సరసన కనిపిస్తారు. శ్రీకృష్ణాంజనేయ యుద్ధం చిత్రంలో రామావతార 'ఫ్లాష్ 'బ్యాక్' వస్తుంది. ఆంజనేయుణ్ణి శాంతింపచేయాల్సిన సన్నివేశంలో సత్యభామగా నటించిన వాణిశ్రీ సీత రూపంలో వస్తుంది. కాని అతను ఆమెను తిరస్కరించి ఆగ్రహంతో తరిమికొడతాడు. తర్వాత రుక్మిణిగా నటించిన దేవిక వచ్చి పిలవగానే కరిగిపోతాడు. ఈ దృశ్యంలో సీత స్వభావాన్ని కూడా దర్శకుడు చెబుతాడు. సీతగా సత్యభామ వచ్చినపుడు ఆంజనేయుణ్ణి రారా అని సంబోధించడం అతను సహించలేడు. సీత తనను ఒక్కసారి కూడా అలా పిలవలేదని ప్రకటిస్తాడు. నాటకీయంగా ప్రవేశపెట్టిన సన్నివేశమైనప్పటికీ ఇందులో సీతగా దేవిక కూడా చక్కగా అమరిపోతుంది. తమిళులు ఎన్టీఆర్‌తో తీసిన సంపూర్ణ రామాయణంలోనూ ఒక సీత వుంటుంది గాని పెద్ద ప్రాధాన్యత లేదు. ఎన్టీఆర్ తీసిన 'భూకైలాస్'లో 'రాముని అవతారం రవికుల సోముని అవతారం' అన్న పెద్ద పాటలో విజయ నిర్మల సీతగా కనిపించడం విశేషం. (ఆమె 'పాండురంగ మహత్యం'లో హే కృష్ణా ముకుందా మురారి పాటలో కృష్ణుడిగానూ అగుపిస్తుంది). కృష్ణకుమారి (పాదుకా పట్టాభిషేకం), శ్రీరంజని కూడా సీత పాత్రలు వేశారు గాని జనం వాటిని అంతగా గుర్తుంచుకోలేదు.

రామాయణ దర్శక నిపుణుడు బాపు సంపూర్ణ రామాయణం దృశ్య కావ్యంలో శోభన్‌బాబును రాముడిగా తీర్చిదిద్దడమే గాక ఆయన పక్కన సీతగా చంద్రకళను నటింపచేసిన బాపు తెలుగు తెరకు కొత్త సీతను బహూకరించారు. చెల్లెలి పాత్రలు, ఘర్షణాత్మక స్త్రీ పాత్రలు వేసే చంద్రకళ అంజలి, దేవిక లాంటి భారీ విగ్రహం కాకున్నా కళాత్మకంగా కరుణాత్మకంగా కనిపించి మెప్పించింది. అయితే అంతకు ముందు వలె కనీస ధిక్కార స్వరం లేకుండా బాపు అత్యంత సాత్విక సాధ్వీ లలామగానే తీర్చిదిద్దారు. పౌరాణికాలలో ఎన్టీఆర్ వరవడికి భిన్నమైన ఈ చిత్ర విజయం తర్వాత బాపూ సీతా కళ్యాణం రూపొందించారు. కథా ఘట్టానికి అనుగుణంగా ముగ్ధ సీతను ఎన్నుకున్నారు. అప్పుడప్పుడే పైకి వస్తున్న జయప్రదను సీతగా మలిచి ఆమె కళ్లను ప్రత్యేకంగా ఫోకస్ చేసి చూపించారు. ఈ చిత్రంలో కథ సంభాషణల కన్నా సంగీత రూపక లక్షణాలు ఎక్కువ. ఈ చిత్రంలో సీతారాముల సన్నివేశాల కన్నా గంగావతరణ సన్నివేశం ఎక్కువ ప్రసిద్ధమైంది.

'శ్రీరామాంజనేయ యుద్ధం'లో బాపు ఎన్టీఆర్‌ను రాముడిగా చూపిస్తూ ఆయన పక్కన సీతగా బి.సరోజాదేవిని నటింపచేశారు. ఆంజనేయుడితో ఘర్షణను భరించలేక భర్తకు ఎదురు చెప్పలేక సతమతమయ్యే పాత్రలో ఆమె బాగా నటించారు.

బాపు 'ముత్యాల ముగ్గు' వాస్తవంలో సాంఘిక రామాయణం తప్ప మరొకటి కాదు. అందులో సంగీతను నాయికగా తీసుకోవడమే గాక శ్రీధర్‌ను హీరోను చేసి ఓహో అనిపించారు. అనుమానంతో సీతను వదిలేయడం, ఆంజనేయుడు వచ్చి కలపడం వంటివే దీనిలో ఇతివృత్తం. సాంఘికమైనప్పటికీ ఆంజనేయుడు కనిపించేలా బాపూ చిత్రీకరించారు. అందుకే తర్వాత కాలంలో ఎన్టీఆర్ మరోసారి 'శ్రీరామపట్టాభిషేకం' తీసినపుడు సీతగా సంగీతకు అవకాశమిచ్చారు గాని ఆ చిత్రం కంగాళిగా తయారైంది. అప్పటికే పెద్దవాడై పోయిన ఎన్టీఆర్ మలిదశలో తీసిన పౌరాణికాలేవీ ప్రజాదరణ పొందలేక పోవడం గమనించదగ్గది. బాపూ దర్శకత్వంలో వాణిశ్రీని మేకప్ లేకుండా చూపించిన 'గోరంత దీపం'లో 'రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా...' అనే పాట చాలా ప్రసిద్ధమైంది. ఇందులో వాణిశ్రీ పాత్ర సీతమ్మోరి చెరలనే గుర్తు చేస్తుంటుంది. బాపూ చిత్రాలన్నిటిలోనూ స్త్రీ పాత్రలను సంప్రదాయ పరిధిలో ధిక్కార స్వరం కలవిగా రూపొందిస్తుంటారు. ఇది వాల్మీకి రామాయణంలో వరవడి కొనసాగింపే.

కె.రాఘవేంద్రరావు అన్నమయ్య చిత్రంతో మరోసారి దేవతా పాత్రలను తీసుకొచ్చారు. ఆయన రాముడు సుమన్. శ్రీరామదాసులో సీతగా నటించిన శ్రీకన్య పర్ణశాలలో సగటు స్త్రీలాగా కనిపించింది. రామదాసు గురించి తెలుసుకోవడం, అతని బాధలకు తల్లిలా తల్లడిల్లి రాముడితో గొడవ పెట్టుకోవడం చేస్తుంటుంది. ఇంతకూ ఇది రామాయణ సీత పాత్ర కాదు, రాఘవేంద్ర సీతమ్మ. అయితే ఆఖరు వరకూ అప్పుడప్పుడూ కనిపిస్తూంటుంది గనక చెప్పుకోవాల్సిందే.





ఇక ఇప్పుడు వర్తమానానికి వస్తే బాలయ్యతో బాపు రూపొందించిన 'శ్రీరామరాజ్యం'. ఇదివరకటి లవకుశ పునర్నిర్మాణమే. ఈ సంగతి బాలకృష్ణ చెప్పేశారు కూడా. కాకుంటే ఆ పేరు పెట్టుకుంటే గతంతో పోల్చి చూస్తారు గనక ధైర్యం లేకపోయిందని కూడా ఒప్పుకున్నారు. ఈ కథకు కీలకమైన సీత పాత్రను నయన తార పోషించడం విశేషం. కేవలం ఆకర్షణీయమైన రూపం మాత్రమే సీత పాత్రకు చాలదని, అభినయం కూడా అవసరమని తెలిసే ఆమెను ఎంపిక చేశారు. ఇప్పటి వరకూ కాస్త ఘర్షణ, ఎక్కువ గ్లామర్ వున్న పాత్రలలో అలరించిన నయనతారను బాపు ఎలా తీర్చిదిద్దారో చూడాల్సిందే. పైగా ఆమె ప్రభుదేవాను పెళ్లి చేసుకోనున్నందున ఆఖరి చిత్రం ఇదేనని కూడా ప్రచారం వుంది. సీత పాత్ర వంటివైతే ఇకముందు కూడా నటిస్తుందని ప్రభుదేవా వివరణ ఇచ్చాడు కూడా. ఈ మాటల్లోనే సీత పాత్ర ప్రత్యేకత, పురుషుల దృక్పథం కూడా తెలియడం లేదూ? ఇంతకూ 'రామరాజ్యం'లో వాల్మీకిగా అక్కినేని నటించడం మరో విశేషం. గతంలో నాగయ్య ప్రాణ ప్రతిష్ఠ చేసిన వాల్మీకి పాత్ర అక్కినేనికి పెద్ద లెక్కలోది కాదు. తెలుగు సినిమా ఎనభై ఏళ్ల సంబరాల వేళ ఈ అభినయ సామ్రాట్ అనుభవాల ఖని వాల్మీకిగా అగుపించడం అందరికీ ఆనందమే కదా!

- పీపీ

వెబ్‌సైట్ల రూపకల్పనలో ప్రస్తుతం గ్రాఫిక్స్, వీడియోస్ ప్రాధాన్యత చాలా ఎక్కువగా వుంది. వెబ్ పేజీల్లో కేవలం టెక్స్ట్ మాత్రమే వుండే స్థితి నుంచి ఇంటర్నెట్ రంగం చాలా దూరం వచ్చేసింది. వెబ్‌సైట్ల ప్రారంభ దినాల్లో టెక్స్ట్‌ను వుంచడమే చాలా ఘనంగా వుండేది. కానీ నేటి పరిస్థితి వేరు.

వెబ్ గ్రాఫిక్స్ మెళకువలు

అన్ని పేజీల్లోనూ ఏదో ఒక తరహా గ్రాఫిక్స్ దర్శనమిస్తున్నాయి. దీనివల్ల వెబ్‌పేజీలకు ఒక నిండుతనం చేకూరింది. అయితే సాధారణ టెక్స్ట్ వున్న పేజీలు లోడ్ అయ్యేదానికంటే గ్రాఫిక్స్ వున్న పేజీలు లోడ్ కావడానికి చాలా ఎక్కువ సమయం పడుతుంది. దీనివల్ల సహజంగానే ఆయా సైట్ల సందర్శకులు విసుగుచెందే అవకాశం వుంటుంది. అంతా క్షణాల్లో జరిగిపోవాలనుకునే ఈ స్పీడ్ యుగంలో ఒక వెబ్ పేజీ కోసం కొన్ని నిమిషాల సమయాన్ని కూడా వెచ్చించలేని పరిస్థితి. అటువంటి సందర్భాల్లో ఆ సైట్ వీక్షకులు ఆ పేజీలను చూడడం విరమించుకోవచ్చు లేదా మళ్ళీ ఆ సైట్‌లోకి ఎప్పటికీ రాకపోవచ్చు. అందువల్ల ప్రస్తుత వెబ్ గ్రాఫిక్స్ డిజైనర్లందరూ సందర్శకుల మనోభావాలను దృష్టిలో వుంచుకుని అతి తక్కువ సైజులో ఎంత మంచి క్వాలిటీగల చిత్రాన్ని అందించగలమనే అంశంపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఒకసారి ఒక సైట్‌ను దర్శించినవారు మళ్ళీ మళ్ళీ ఆ సైట్‌లోకి రావాలంటే కంటెంట్‌తోపాటు చిత్రాల క్వాలిటీ, తక్కువ సమయంలో లోడ్ కావడం వంటి వాటిపైనే ఆధారపడి వుంటుంది. ఇంతటి ప్రాధాన్యత గల వెబ్ గ్రాఫిక్స్ డిజైనింగ్‌లో కొన్ని ప్రధాన అంశాలను గమనంలో వుంచుకోవాలి.

వెబ్ పేజీల్లో గ్రాఫిక్స్ జోడించాలంటే ఆ చిత్రాలను ఏ ఫైల్ ఫార్మెట్‌లో నిల్వ చేయాలనేదే ముందుగా కలిగే సందేహం. సాధారణంగా వెబ్ గ్రాఫిక్స్‌లో అత్యధికంగా వినియోగించబడే జెపిఇజి, జిఫ్ ఫార్మెట్‌లు. వెబ్ పేజీలో ఉపయోగించే గ్రాఫిక్స్‌ని ఏ ఫార్మెట్‌లో వుంచితే మంచిదనే విషయం ఆ చిత్రం యొక్క లక్షణాలపై ఆధారపడి వుంటుంది.

జెపెగ్ (JPEG- Joint Photographic Experts Group):

ప్రకృతి సంబంధిత చిత్రాలను గాని, రంగులు వరుసగా (కంటిన్యువస్‌గా) మారే చిత్రాలనుగాని ఉపయోగిస్తూ పూర్తి కలర్ లేదా గ్రే స్కేల్ చిత్రాలను నిల్వ చేయడానికి ఈ ఫార్మెట్ ఉపయోగపడుతుంది. ఉదాహరణకు ఒక సీనరీ స్కాన్ చేసి, వెబ్ పేజీలో జోడించాలంటే ఈ ఫార్మెట్‌ను ఉపయోగించాల్సిందే. స్కాన్ చేసిన ఫొటోలతోపాటు సీనరీ చిత్రాలు, షేడింగ్స్, నీడలు (షాడోస్) వున్నటువంటి చిత్రాలకు ఈ ఫార్మెట్ బాగా పనికొస్తుంది. చిత్రంలో ఎక్కువ రంగులు వున్నా, లేక క్లిష్టమైన స్పెషల్ ఎఫెక్ట్స్ (రెండరింగ్స్ వంటివి) ఉపయోగించినా జిఫ్ కంటే ఈ ఫార్మెట్‌నే ఎంచుకోవడం మంచిది. జెపెగ్ ఫార్మెట్ 'హై లాస్ కంప్రెషన్' పద్ధతిని ఉపయోగించుకుంటుంది. ఈ ఫార్మెట్‌కి కన్వర్ట్ అయ్యేటప్పుడు ఒరిజనల్ ఇమేజ్‌లో కొంత కలర్ ఇన్ఫర్మేషన్ తొలగించబడుతుంది. జెపెగ్ ఫార్మెట్ 16.7 మిలియన్ కలర్స్‌ని సపోర్ట్ చేస్తుంది.

చాలావరకు ఇమేజ్ ఎడిటర్లు ఫైల్ ఎంత మేరకు కంప్రెస్ చేయాలో డిజైనరే సెలెక్ట్ చేసుకునే అవకాశం కల్పిస్తాయి. దీనివల్ల ఆ చిత్రం క్వాలిటీ ఎలా వుండాలి, ఫైల్ సైజ్ ఎంత వుండాలనే అంశాన్ని నిర్ధారించవచ్చు. ఫైల్ సైజు ఎంత తక్కువ చేస్తే చిత్రం క్వాలిటీ కూడా అంత తగ్గుతుంది. ఇల్లస్ట్రేషన్లు, కార్టూన్లు, టెక్స్ట్ లేదా షార్ప్ ఎడ్జ్‌లు కలిగిన చిత్రాలను ఈ ఫార్మెట్‌లో సేవ్ చేయడం మంచిది కాదు. ఈ ఫార్మెట్‌లో షార్ప్‌ఎడ్జ్ వుండే చిత్రాలు మసకబారిపోయే అవకాశం వుంది. అటువంటి చిత్రాలకు జిఫ్ ఫార్మెట్ బాగా ఉపయోగపడుతుంది.

జిఫ్ (GIF- Graphics Interchange Format)

వరుసగా వచ్చే కలర్స్ కాకుండా వేర్వేరు కలర్స్ (కట్ కలర్స్) వున్న చిత్రాలకు ఈ ఫార్మెట్ బాగా ఉపయోగపడుతుంది. ఇల్లస్ట్రేషన్లు, కార్టూన్లు, కలర్ బ్లాక్‌లు కలిగిన చిత్రాలకు (ఐకాన్లు, బటన్లు, హారిజంటల్ గీతలు మొదలైనవి) ఈ ఫార్మెట్‌ను ఉపయోగించవచ్చు. ఇది కూడా జెపెగ్ ఫార్మెట్ మాదిరిగానే హై కంప్రెషన్ ఫార్మెట్. కలర్ బ్లాక్‌లను తొలగించడం ద్వారా ఇది కంప్రెషన్ చేస్తుంది. జిఫ్ ఫార్మెట్ 256 లేదా అంతకంటే తక్కువ రంగులను మాత్రమే సపోర్ట్ చేస్తుంది. అయితే వెబ్ కోసం ఈ ఫార్మెట్‌లో చిత్రాలను తయారుచేసేటప్పుడు ఒక విషయం గుర్తుంచుకోవాలి. మాకింతోష్,

విండోస్‌లలో కేవలం 216 కలర్స్ మాత్రమే షేర్ చేయబడతాయి. ఈ రంగులను మాత్రమే వెబ్ ప్యాలెట్ జిఫ్‌లు తయారుచేసేటప్పుడు ఉపయోగించాలి. లేకపోతే ఆ రంగులు మాకింతోష్ కంప్యూటర్లలో ఒకరకంగానూ, విండోస్ పీసీల్లో మరో రకంగానూ కనబడతాయి.

వెబ్‌కి చిత్రం డిజైన్ చేయడం అనగానే 72 డిపిఐ రిజల్యూషన్‌లో డిజైన్ చేయాలని సాధారణంగా అందరూ చెప్పే అంశమే. వెబ్‌కి ఈ రిజల్యూషన్ సరిపోయినప్పటికీ ఇదే రిజల్యూషన్‌లో డిజైన్ చేయాలనడం సరికాదు. నిజానికి ఈ రిజల్యూషన్ అనేది మనం ఉపయోగించే మోనిటర్ స్క్రీన్ సైజుపైన, దాని రిజల్యూషన్‌పైనా ఆధారపడి వుంటుంది. మనదేశంలో ఎక్కువమంది 15 ఇంచ్‌ల స్క్రీన్లను, 800×600 డిపిఐ రిజల్యూషన్‌ను ఉపయోగిస్తుంటారు. మనం తయారుచేసే వెబ్‌సైట్ మనదేశంలో వారే ఎక్కువగా చూస్తారనుకుంటే 82డిపిఐ లేదా 75డిపిఐలో తయారుచేయాల్సి వుంటుంది. అలాకాక ఆ సైట్ అమెరికాలో వారిని ఉద్దేశించినదైతే అక్కడ ఎక్కువమంది 17ఇంచెస్ లేదా ఇంకా పెద్ద స్క్రీన్ (1024×768 రిజల్యూషన్)లను ఉపయోగిస్తారు. కనుక 82డిపిఐ నుంచి 64 డిపిఐ వరకు డిజైన్ చేయవచ్చు. ఇప్పుడు ఎల్‌సిడి మోనిటర్ల వినియోగం పెరిగిన తర్వాత 800×600 డిపిఐ రిజల్యూషన్‌ను వాడకం కూడా దాదాపుగా తగ్గిందనే చెప్పాలి.

ఫైల్ సైజులు మార్చడం

ఏ ఇమేజ్ ఎడిటర్‌ను ఉపయోగించైనా వెబ్ పేజీలలో జోడించే చిత్రాల సైజును సులభంగా మార్చవచ్చు. చిత్రాలు మంచిగా కనిపించాలంటే ఇమేజ్ సైజ్‌లు మార్చేటప్పుడు తప్పనిసరిగా కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. స్కాన్ చేయబడిన ఫొటోల సైజుని నేరుగా పెంచితే అవి చెక్‌బాక్సులుగా కనబడతాయి. పూర్తిగా రెక్టాంగిల్స్ కలిగిన 'ఎలియాస్డ్' చిత్రాలను ఎంత సైజుకు పెంచినా క్వాలిటీ తగ్గదు. చిత్రాన్ని వీలైనంత చిన్న సైజుకు పెడితేనే క్వాలిటీ బావుంటుంది. అయితే చిత్రం సైజు తగ్గించేటప్పుడు యాంటి ఎలియాసింగ్ ఫీచర్‌ని కలిగివుండే ఇమేజ్ ఎడిటర్ (ఫొటోషాప్, పెయింట్‌షాప్) లను ఉపయోగిస్తే ఫలితాలు బాగుంటాయి. చిత్రం సైజు మార్చేటప్పుడు అది ట్రూ కలర్స్‌లో వుందో లేదో గమనించడం మర్చిపోకండి. ఇండెక్స్‌డ్ కలర్ చిత్రాల సైజు తగ్గించేటప్పుడు యాంటీ ఎలియాసింగ్‌కి అవసరమైన రంగులు సరిగా లభ్యంకాక చిత్రం క్వాలిటీ తగ్గిపోతుంది. కనుక సైజు తగ్గించే ముందు ట్రూ కలర్స్‌కి మార్చి తగ్గించడం మంచిది. ఆ చిత్రాన్ని ఆర్‌జిబి లేదా 24 బిట్ లేదా మిలియన్ కలర్స్ ఆప్షన్లలో ఏదో ఒకదానికి మార్చుకుని అప్పుడు సైజు మార్చండి.

ఇమేజ్ కలర్ రిడక్షన్

మీరు ఫుల్ కలర్ ఇమేజ్‌ని జిఫ్ ఫైల్‌గా సేవ్ చేయాలన్నా, లేక ఏదైనా జిఫ్ ఫైల్ సైజు తగ్గించాలన్నా కలర్స్‌ని తగ్గించవలసి వుంటుంది. సాధారణంగా జిఫ్ ఫైల్‌ని సేవ్ చేయగలిగిన ఏ ఇమేజ్ ఎడిటర్ అయినా కలర్ రిడక్షన్ టెక్నిక్‌ని కలిగివుంటుంది. ఈ రకమైన ఇమేజ్ ఎడిటర్లలో ఆప్టిమైజేషన్ ప్యానెల్ లేదా ఇండెక్స్‌డ్ కలర్, రెడ్యూస్ కలర్, 256 కలర్స్ లేదా 8 బిట్ కలర్ అనే ఆప్షన్లు లభ్యమవుతాయి. వీటిలో ఏదైనా మెనూ నుంచి చిత్రంలోని రంగులను తగ్గించుకోవచ్చు. ఈ రకంగా కలర్స్‌ని తగ్గించేటప్పుడు డిథరింగ్ మరియు కలర్ సబ్‌స్టిట్యూషన్ అనే రెండు ఆప్షన్లు లభ్యమవుతాయి. ఈ డిథరింగ్ టెక్నిక్‌లో వున్న 'హ్యూ' తోనే ఎక్కువ రంగులు వున్నట్లుగా చూపించే వీలుంటుంది. 8 బిట్ మోనిటర్లపై పనిచేసే వెబ్ బ్రౌజర్లు అన్నీ ఈ పద్ధతి ద్వారానే ఎక్కువ రంగులను తక్కువ రంగులుగా మార్చి చూపుతాయి. ట్రూ కలర్ చిత్రాలను ఇండెక్స్‌డ్ కలర్ చిత్రాలుగా మార్చడానికి ఇమేజ్ ఎడిటర్లు ఈ పద్ధతినే ఉపయోగిస్తాయి. కొన్ని సందర్భాలలో డిథరింగ్ వల్ల తయారయ్యే చిత్రాలు బాగా క్వాలిటీ నష్టపోతాయి. ఈ కారణంగా ఫొటోలు వంటివాటిని జిఫ్ ఫార్మెట్‌కి మార్చేటప్పుడే డిథరింగ్ ఆప్షన్‌ని సెలక్ట్ చేసుకోవాలి.

కలర్ రిడక్షన్‌కి మరొక పద్ధతి కలర్ ప్యాలెట్ తగ్గించడం. చిత్రంలో ఎన్ని రంగులు తగ్గిస్తే ఫైల్ సైజ్ అంత చిన్నదిగా మారుతుంది. 256, 128, 64 లేదా 32 కలర్ ప్యాలెట్‌లను సెలెక్ట్ చేసుకుంటూ, ఏ కలర్ ప్యాలెట్ వద్ద చిత్రంలోని రంగులు ఎక్కువగా నష్టపోకుండా చిత్రం క్వాలిటీ తగ్గకుండా వుంటుందో ఆ ప్యాలెట్‌ని ఉపయోగించడం, జిఫ్ చిత్రాలను ఉపయోగించదలిస్తే వెబ్ సేఫ్ ప్యాలెట్‌ని ఉపయోగించడం మంచిది. సరైన ఫార్మెట్, రిజల్యూషన్ కలిగిన చిత్రాలను ఉపయోగించడం ద్వారా వెబ్‌పేజీలను ఆకర్షణీయంగా రూపొందించవచ్చు.

- కె.ఎక్స్.రాజు

కొత్తగా ఐదు భాషలలో ట్విట్టర్

సోషల్ నెట్వర్కింగ్ వెబ్‌సైట్ ట్విట్టర్... ఇంటర్నెట్ ప్రపంచంలో ఓ మహా సాధనం. దీన్ని త్వరలో మరో ఐదు భాషలలో విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆ ఐదు భాషలు ఏమిటంటే సింపుల్ మరియు సాంప్రదాయబద్ధంగా ఉండే చైనీస్, హిందీ, టాగలాగ్, మలై. ఎవరికివారు తమకు నచ్చిన, తెలిసిన భాషలో ట్వీట్స్ పంపిస్తే ఆ సంతృప్తి చెప్పలేనిది. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా ప్రవేశపెట్టిన ఐదు భాషలతోపాటు ఈ సామాజిక వెబ్‌సైట్ ట్విట్టర్ మొత్తం 12 భాషలను సపోర్ట్ చేస్తుంది. వీటితో పాటు రాబోయే కాలంలో ట్విట్టర్ ట్రాన్సలేషన్ సెంటర్‌లోకి స్వీడిష్, డానిష్, ఫినిష్, హంగేరియన్ భాషలను కూడా ప్రవేశపెట్టనున్నట్టున్నారు. ట్విట్టర్.కామ్‌లో ఉన్న సెట్టింగ్స్ పేజి ద్వారా లాంగ్వేజి ఆప్షన్ల లోనికి వెళ్లి మీకు నచ్చిన భాషను సెలెక్ట్ చేసుకొవచ్చు.



ఈ న్యూస్

way2sms

వినియోగదారులు 2కోట్లు

కంప్యూటర్ నుంచి మొబైల్‌కు ఉచితంగా మెసేజ్‌లు పంపే సౌకర్యం కల్పిస్తున్న వెబ్ పోర్టల్స్‌లో వే2ఎస్ఎంఎస్ ఒకటి. హైదరాబాద్‌కు చెందిన ఈ వెబ్ పోర్టల్ వినియోగదారుల సంఖ్య 20మిలియన్లకు చేరింది. 'తమ వెబ్‌సైట్‌లో 36.5 కోట్ల మొబైల్ కాంటాక్ట్స్ ఉన్నాయని, నెలకు 5.5కోట్ల మొబైళ్లకు ఎస్ఎంఎస్‌లు వెళుతుంటాయని' ఆ పోర్టల్ ఒక ప్రకటనలో తెలిపింది. 2006లో ఏర్పడిన తమ నెట్‌వర్క్‌లో ప్రతినెలా 7లక్షల మంది కొత్త ఖాతాదారులు తమ పేర్లు నమోదు చేసుకుంటున్నారని ఆ పోర్టల్ తెలిపింది.

చూద్దామా

బిద్రీపాత్రలు

కొన్ని ప్రదేశాలు పర్యాటక స్థలాల్లా అనిపించవు. అక్కడికి వెళ్ళి చూస్తేనే వాటి ప్రత్యేకత తెలుస్తుంది. అటువంటి వాటిలో హైదరాబాద్‌కి దగ్గర్లోని కర్నాటక ప్రాంతమైన బీదర్ ఒకటి. కొన్నేళ్ళ క్రితం ఆంధ్రప్రదేశ్‌లో మద్యనిషేధం ఉన్నప్పుడు 'బీరు బాబులు' తరచూ బీదర్‌కి ప్రయాణం కడుతుండేవారు. దురదృష్టవశాత్తు బీదర్ అలా మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది. మా ప్రయాణం ఆ సందడి సద్దుమణిగిన కొన్ని సంవత్సరాల తర్వాత జరిగిందనుకోండి!



బీదర్ పోదామా



చౌబారా క్లాక్ టవర్

హైదరాబాద్ నుండి సుమారు 140 కిలోమీటర్ల దూరంలో ఉంది బీదర్. 9వ జాతీయ రహదారి మీద ఓ మూడు గంటల ప్రయాణం. పటాన్ చెరు, సదాశివపేట దాటి, జహీరాబాద్ చేరాం. అక్కడ్నుండి కుడివైపుకి జాతీయ రహదారి వదిలి మల్కాపూర్ గుండా బీదర్ చేరాం. జహీరాబాద్ కంటే ముందే రోడ్డు పక్క ఎర్రటి మట్టి మన దృష్టిని ఆకర్షిస్తుంది. ఆ నేలలు 'లాటరైట్' అనే రకానికి చెందినవి. వాటిలో ఇనుము అధికంగా ఉంటుంది. అందుకే 'రస్టు' పట్టిన ముదురు ఎరుపు రంగు కనిపిస్తుంది.

దారిలో (ముంబై హైవేలో) రెండు చోట్ల ఘోర ప్రమాదాలు జరిగిన దాఖలాలు కనిపించాయి. ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయట. ముఖ్యంగా లోడుతో ఉన్న లారీలు. జహీరాబాద్‌లో ద్విచక్రవాహనాలకి కాస్త విశ్రాంతినిచ్చి రిలాక్సయ్యాం. రోడ్డు పక్క స్టాల్‌లో చాయ్, బిస్కట్, సమోసాలతో కాలం వెళ్లదీశాం.

అరగంట విరామం తర్వాత మా వాహనాల ఇంజన్లు వేగం పుంజుకున్నాయి. బీదర్ పట్టణం ఒకప్పుడు విదురా నగరం పేరుతో ఉండేదట. మహాభారతంలోని విదురుడు ఇక్కడే ఉండేవాడట. అయితే అది పురాణం.

చరిత్ర ప్రకారం 1429లో బహమనీ రాజు ఒకటవ అహ్మద్ షా దీన్ని రాజధానిగా చేసుకున్నాడు. 'అహ్మదాబాద్ బీదర్' అని పేరు మార్చాడు. దాదాపు ఒక శతాబ్దం పాటు బహమనీ రాజుల పాలనలో ఉన్న బీదర్, 1527లో దక్కను పాలకులైన బరీద్ షాహీల చేతుల్లోకి వెళ్లింది. మరో రెండు వందల సంవత్సరాల తర్వాత ఔరంగజేబు బీదర్‌ని ఆక్రమించాడు. అతను 1713లో ఆసఫ్ జాహీని దక్కను ప్రాంత సుబేదారుగా నియమించాడు. ఆసఫ్ జాహీ 1724లో నైజాం ప్రభుత్వాన్ని నెలకొల్పాడు.

ఇంతమంది చేతులు మారినా, బీదర్‌లో మనకు కనిపించే శిధిల కట్టడాల్లో చాలా వరకు బహమనీ రాజులవే కావడం విశేషం. బీదరంతా శిధిలమౌతున్న మహా నిర్మాణంలా అనిపించింది. ఈ పట్టణానికి అయిదు ద్వారాలున్నాయి. వాటిలో ఒక దాని గుండా ప్రయాణించి 'పాత నగరానికి చేరాం. అక్కడ 15వ శతాబ్దపు బీదరు కోట ఉంది. దానికి చేరే ముందు ఒక అద్భుత నిర్మాణం కనిపించింది. అదే ఎనభై అడుగుల ఎత్తున్న పహారా గోపురం. దానిని చౌబారా అంటారు. అయిదు శతాబ్దాల క్రితం దాని పైన సైనికులు పహారా కాస్తూ పట్టణానికి రక్షణగా ఉండేవారట. ఇప్పుడు మాత్రం అది ట్రాఫిక్ ఐలాండ్‌లా ఉంది! ఇటీవలి కాలంలో ఈ మహాగోపురంపై ఓ భారీ గడియారం అమర్చారు. చాలా క్లాక్ టవర్లలాగే అదీ పనిచేయడం లేదు. ఆ పహారా గోపురం పైకి వెళ్లే మార్గం తాళం వేసి ఉంది. ఎప్పుడూ తీయరట. ఎవరూ పట్టించుకోరట కూడా!

బీదరు కోట అంత శిధిలావస్థలో ఉన్నా, నాకెందుకో హైదరాబాద్‌లోని గోల్కొండ కంటే మెరుగే అనిపించింది. కిలోమీటర్ల కొద్దీ పాకిన గోడలు, వాటిపై అక్కడక్కడా టవర్లు ఇంకా గత కాలపు రాజసాన్ని చూపుతున్నాయి. అద్భుతమైన 'ఆర్చీలు', ఒక భారీ మర్రి చెట్టు చూడ్డానికి వింతగా వున్నాయి. ఆ చెట్టుకి సమీపంలో 'రంగీన్ మహల్' ఉంది. దీన్ని 1487లో ఒకటవ మహ్మద్‌షా నిర్మించాడు. దీనిలో ఇంకా రంగురంగుల పలకలు, ముత్యాలు అమర్చిన నగిషీలున్నాయి.

దాని పక్కనే ఒక చిన్న మ్యూజియం ఉంది. ఒకప్పుడు అది రాజుల స్నానశాల! రాతియుగం నాటి పరికరాలు, విగ్రహాలు, ఆభరణాలు ఇక్కడ ప్రదర్శనలో ఉన్నాయి.

ఇవన్నీ ఒక ఎత్తైతే, కాస్త దూరంలో ఉన్న 'సోలా కుంభ్ మసీదు' మరో ఎత్తు. దీన్ని 1423లో నిర్మించారట. దీని మధ్య భాగంలో 16 స్తంభాలున్నాయి. అందువల్లే ఆ పేరు. ఈ మసీదుకి తాళం వేసి ఉంటుంది. కానీ మ్యూజియంలో వారిని అడిగి తీయించవచ్చు. మసీదు చుట్టూ అందమైన గార్డెన్ కూడా ఉంది.

మసీదు నుండి బయటికి వస్తుంటే కోట తాలూకు గాంభీర్యం ఇంకా కనిపించింది. అసలు ఈ కోట మూడవ శతాబ్దంలో యాదవులు, కాకతీయులకు చెందినదని పురాతత్వ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఆ తర్వాత దీన్నే సుల్తాన్ అహ్మద్ షా బహమనీ తన కోటగా మార్చుకుని, టర్కీ-పర్షియా నుండి కళాకారులను పిలిపించి పునర్నిర్మించాడు.

చౌబారా గోపురానికి సమీపంలోనే మహమూద్ గవన్ మదరసా ఉంది. ఇది దాదాపుగా శిధిలమైపోయినట్లే. అప్పట్లో ఇది మూడంతస్థుల భవనమట. దీనికి నాలుగు ఎత్తైన మినార్లు ఉంటేవట. ఇప్పుడొక్కటే మిగిలింది. దానిపై తాపడం చేసిన నీలం, తెలుపు, పసుపు రాళ్ళు ఇరాన్ నుండి తెప్పించారట.

ఇక్కడికి దగ్గర్లోనే బహమనీ సుల్తానుల సమాధులున్నాయి. అయితే ఇవన్నీ అత్యంత హీనావస్థలో ఉన్నాయి. సుల్తాన్ హుమయున్ సమాధి మాత్రం పిడుగు వల్ల రెండుగా చీలిపోయింది. ఇవన్నీ చూస్తే చరిత్ర ఎంత ఘనంగా ఉండేదో అనిపిస్తుంది. ఈ ప్రాంతాన్ని మరింత ఆకర్షణీయంగా చేసి పర్యాటకులను రప్పించవచ్చనిపిస్తుంది కూడా.

బీదర్‌లో శతాబ్దాలనాటి శిధిలాలూ, సుల్తానుల సమాధులే కాదు... అద్భుతమైన 'బిద్రీ' కళ కూడా కనిపిస్తుంది. నల్లటి లోహపు పాత్రలపై తెల్లటి వెండి దారాలతో అందమైన చిత్రాలుగా అమర్చడం బిద్రీ ప్రత్యేకత. ఆ కళాకారుల వేళ్ళు సున్నితంగా కళాఖండాలు సృష్టించడం చూస్తుంటే అబ్బురపోక తప్పదు. బీదర్ వెళ్తే మాత్రం కచ్చితంగా ఒక బిద్రీ పాత్ర తెచ్చుకుంటారు. అంత బావుంటాయవి!

- యాజీవ్

నవ్వుల్ - పువ్వుల్

ఎవరంటే ఇష్టం?

డిఇఓ: పిల్లలూ! మీకు స్కూల్లో ఎవరంటే ఇష్టం?

పిల్లలు: మాకు అటెండరంటే చాలా ఇష్టమండీ.

డిఇఓ: ఎందుకని?

పిల్లలు: ఎందుకంటే ... మేం ఇళ్లకెళ్లాలంటే బెల్లు కొట్టేది ఆయనే కదా!

వెయ్యి చీరలు

భార్య: నేను టీవీ సీరియళ్లలో నటిస్తానండీ.

భర్త: ఎందుకే

భార్య: మరి సీరియల్ పూర్తయ్యేలోపు కనీసం వెయ్యి చీరలైనా కట్టుకోవచ్చుకదా.

ఏది దూరం?



శ్యామ్: ఒరే! నాకో అనుమానంరా. మనకు అమెరికా దూరమా? సూర్యుడు దూరమా?

రామ్: అమెరికానే దూరంరా.

శ్యామ్: ఎలాగంటావ్?

రామ్: సూర్యుడైతే కనిపిస్తాడు. అమెరికా కనిపించదుగా. అందుకన్నమాట.

ఆడ...మగ...

సరిత: వనితా! అటు చూడు. ఆ తీగ మీద రెండు కాకులు వాలాయి కదా. వాటిలో ఆడ కాకి ఏదో, మగ కాకి ఏదో చెప్పగలవా?

వనిత: అబ్బో...మనకు అన్ని తెలివితేటలు లేవులే. నీకు తెలిస్తే చెప్పు.

సరిత: చీర మీద వాలింది ఆడకాకి. ప్యాంటు మీద వాలింది మగ కాకి.

ఏనుగు-చీమ



కొంటె ప్రశ్న: ఏనుగు రావడం చూసి, చీమ చెట్టు వెనక దాక్కుంది? ఎందుకు?

తుంటరి జవాబు: కాలు అడ్డం పెట్టి ఏనుగును పడేద్దామని.

కుడి ఎడమైతే

(ప్రసాద్ ఓ స్టెనోగ్రాఫర్‌ని ప్రేమించి పెళ్లాడతాడు)

మిత్రుడు: ఏరా ప్రసాద్! కొత్త కాపురం ఎలా వుంది?

ప్రసాద్: ఇది వరకు ఆమెకు నేను డిక్టేట్ చేసేవాణ్ణి. ఇప్పుడామె నన్ను డిక్టేట్ చేస్తోంది.

డాక్టర్ సర్టిఫికెట్

బాస్: ఏంటిది?

ఉద్యోగి: డాక్టర్ సర్టిఫికెట్

బాస్: ఎందుకు?

ఉద్యోగి: నేను వారం రోజులు పనిచేయలేనని చెప్పడానికి.

బాస్: దానికి డాక్టర్ సర్టిఫికెట్ ఎందుకు? నువ్వు పనిచేయగలవో లేదో నేను చెప్తానుగా.

ఎంత?



రామారావ్: సార్! టైమెంతైంది?

సార్: తొమ్మిదీ పది.

రామారావ్: సార్! కరెక్టుగా చెప్పండి. మరీ గంట తేడాతో చెబుతారేం?

కిలో నూనె

మాధవి: ఏవండీ కిలో నూనె ఎంత?

వ్యాపారి: యాభై రూపాయలు

మాధవి: ఒకేసారి పది కేజీలు తీసుకుంటే ఏమైనా తగ్గుతుందా?

వ్యాపారి: (నవ్వుతూ...) ఆ... పావు కేజీ నూనె తగ్గుతుంది.

ప్రమాణం

హారీష్: ఇకమీదట మందు ముట్టనని మొన్నే కదరా ప్రమాణం చేశావు? అప్పుడే మొదలెట్టేశావా?

గిరీష్: అవును. ఇప్పటికీ అదే మాట మీద వున్నాను.

హారీష్: మరీ అంత వెర్రిపప్పలాగా కనిపిస్తున్నానా. ఓ పక్క తాగుతూనే అలా అంటావ్.

గిరీష్: కాస్త కళ్లజోడు పెట్టుకొని చూడరా బాబూ. నేను స్ట్రాతో తాగుతున్నాను.

-చూటీ

అట్టమీద కథ

నిజాలు కక్కించే 'నార్కో'

మైనింగ్ మాఫియా కింగ్ గాలి జనార్ధన్‌రెడ్డిని సిబిఐ వారు కస్టడీలోకి తీసుకుని సుదీర్ఘంగా విచారించారు. 'అవసరమైతే నార్కో టెస్టులు నిర్వహిస్తాం...' అని సిబిఐ ఉప సంచాలకులు లక్ష్మీనారాయణ ప్రకటించారు. ఈ మాటలు మనకు చాలా కేసుల్లో వినిపించేవే. నిఠారీలో బాలల మేధం, ముంబాయి పేలుళ్లు, ఆయేషా హత్య కేసు, స్టాంపు పేపర్ కుంభకోణం వంటివాటన్నిటిలో ..ఘరానా నేరస్తులైనా కరుడుగట్టిన హంతకులైనా, టెర్రరిస్టు రాక్షసులైనా అంత తేలిగ్గా నోరు విప్పరు. జరిగిన దారుణంలో మీ పాత్ర ఏమిటని అడిగి అడిగి అధికారులు అలసి పోవలసిందే. అదిగో అలాంటప్పుడు ఆదుకునేది నార్కో టెస్టులు అనబడే పరీక్షలు, పరికరాలే. ఇవి నిజం కక్కిస్తాయని ఒక నమ్మకం. ఎన్నో కేసుల్లో వీటివల్ల నిజాలు బయటకు వచ్చాయి. ఇంతకీ ఈ టెస్టులేంటి.. వాటికి సంబంధించిన న్యాయపరమైన... శాస్త్రపరమైన అంశాలేంటి? ఈ వారం 'అట్టమీద కథ'లో తెలుసుకుందాం.



- బి. అమరనారాయణ

చిన్నాచితకా కేసులయితే ...నాలుగు తగిలిస్తే దోషులు అసలు నిజం కక్కేస్తారు..ఇంకా మొండి ఘటాలైతే పోలీస్ మార్కు థర్డ్ డిగ్రీ పద్ధతులుండనే వుంటాయి. కానీ కోట్లకు పడగలెత్తిన 'ఘనులు', పచ్చి నెత్తురు తాగే నేరస్తులు నిజాలు అంత ఈజీగా చెప్పరు. ఈ క్రమంలోనే సాంకేతిక సత్య శోధన పరీక్షలు..నార్కో ఎనాలసిస్, పాలీగ్రాఫ్ టెస్ట్, బ్రెయిన్ మ్యాపింగ్ వంటివి తెరపైకి వచ్చాయి. నిఠారి వరుస హత్యలు, ముంబయి రైలు పేలుళ్ల వంటి అత్యంత తీవ్రమైన కేసుల్లో నిందితులను ఈ పరీక్షల ద్వారా విచారించారు. వీటిని పశ్చిమ దేశాల్లో ట్రూత్ సీరమ్స్‌గా పిలుస్తారు. అయితే వీటికి న్యాయబద్ధతే లేదని మానవ హక్కుల రక్షకులంటే..99 శాతం సత్యాలు వెల్లడవుతాయని దర్యాప్తు రంగ నిపుణులు వాదిస్తారు. చాలా దేశాలు వీటికి దూరంగా ఉన్నాయి. గతేడాది మే 5న సుప్రీం కోర్టు ఈ పరీక్షలు రాజ్యాంగ విరుద్ధమంటూనే ఏదైనా కేసులో నార్కో పరీక్షలు నిర్వహించాలంటే తప్పనిసరిగా సదరు వ్యక్తి అనుమతి తీసుకోవాలని చెప్పింది. ఇంత వివాదాస్పదమైన ఈ పరీక్షల ప్రక్రియ ఎలా వుంటుందో ఇప్పుడు చూద్దాం.

నార్కో ఎనాలసిస్

మనిషిని సుప్తచేతనలోకి తీసుకెళ్లే మందును వినియోగించడాన్ని నార్కో సింథసిస్ లేదా నార్కో ఎనాలసిస్ అంటారు. మూడు లీటర్ల సజల నీటిలో మూడు గ్రాముల సోడియం పెంటోథాల్ లేదా సోడియం అమైథాల్ కలిపి ద్రావకాన్ని తయారు చేస్తారు. దీనిని ఇతర రసాయనాలతో మిశ్రమ మందు తయారు చేసి విచారించాల్సిన వ్యక్తి శరీరంలోకి ఎక్కిస్తారు. పశ్చిమ దేశాల్లో ఈ మందులను ట్రూత్ సీరమ్స్ అంటారు. శరీరంలోకి మందు చేరిపోగానే నిందితుడు సగం అపస్మారకస్థితిలోకి వెళ్లిపోతాడు. నిద్రావస్థలోకి జారుకున్నట్లు ఉంటుంది. ఈ పరిస్థితిలో ఏం అడిగినా ఆ వ్యక్తి దాచుకోకుండా బదులిచ్చే అవకాశముంటుంది. మామూలుగా అయితే ఊహించుకొని అబద్ధాలు ఆడే వీలుంటుంది. కానీ ఈ స్థితిలో అలా ఊహించి చెప్పే వీలుండదు. లోపల దాచుకున్న విషయాన్ని నిరాటంకంగా చెప్పేలా ఆ వ్యక్తిని ఉసిగొల్పుతుంది. అదే సమయంలో భ్రమల్లో తేలియాడేలా చేస్తుంది. వీటిని ఆధారంగా తీసుకొని విశ్లేషించగలిగే నిపుణులు నిందితుడిని ప్రశ్నిస్తారు. చాలా తీవ్రమైన నేరాల్లో దర్యాప్తును వేగవంతం చేసేందుకు ఈ పరీక్షలకు చాలా ప్రాధాన్యత ఉంటుందని సంబంధిత నిపుణులు పేర్కొంటారు. నిందితుల నుంచి నిజాలు రాబట్టడంలో ఈ పరీక్షలు స్వర్ణావకాశంగా భావిస్తారు. అంతర్జాతీయ చట్టం ప్రకారం ఈ విధంగా విచారణ జరపడం వేధించడంగానే పరిగణిస్తారు. ఈ మందు మోతాదు మించి ఎక్కిస్తే ఆ వ్యక్తి కోమాలోకి వెళ్లిపోయి మరణానికి కూడా దారి తీసే ప్రమాదముంది. జీవక్రియలపైనా ప్రభావముంటుంది.

మానసిక రోగులకు వైద్యమందించేందుకు ఈ మందును వినియోగించే పద్ధతిని 1930లో డాక్టర్ విలియం బ్లెక్‌వెన్ వెలుగులోకి తెచ్చారు. ఇప్పటికీ ఎంపికచేసిన సందర్భాల్లో ఈ మందును వినియోగిస్తున్నారు. తీవ్ర మానసిక రుగ్మతలతో బాధపడేవారికి ఆ వ్యాధి తీవ్రతను అంచనా వేసేందుకు లేదా దానికి సంబంధించిన కీలక సమాచారాన్ని గుర్తించి తద్వారా రోగికి ఉపశమనం కలగించేందుకు కూడా ఈ మందును వినియోగిస్తారు. ఈ నార్కో ఎనాలసిస్ పద్ధతులను 20వ శతాబ్దం ప్రారంభంలోనే వినియోగించినట్లు చెబుతారు.

ప్రప్రథమంగా 1922లో నిందితుల విచారణకు ఈ పద్ధతి వినియోగించినట్లు తెలుస్తోంది. అమెరికా కూడా తొలుత ఈ 'నార్కో'ను వినియోగించింది. యుద్ధఖైదీలను ఈ పద్ధతిలోనే విచారించేవారు. అయితే 1989లో న్యూజెర్సీ అత్యున్నత న్యాయస్థానం దీన్ని నిషేధించింది. సోడియం అమైథాల్ నార్కో ఎనాలసిస్ పరీక్షల్లో వెల్లడైన ఫలితాలు శాస్త్రీయంగా రుజువు కానందున ఆ పద్ధతి ద్వారా జరిపే విచారణను పరిగణనలోనికి తీసుకోలేమని చెప్పింది. అయితే సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికా రహస్యంగా ఈ ట్రూత్ సీరమ్స్ పరీక్షలను కొనసాగిస్తోందని చెబుతారు. నిజానికి పశ్చిమ దేశాల్లో అనేక రహస్య పద్ధతులలో నిందితులను హింసించడం కద్దు. అయితే చాలా దేశాల్లో వీటిపై నిషేధం వుంది. మనదేశంలో ఈ పరీక్షలను మనోవిశ్లేషణ నిపుణుడు, ఫిజియోథెరపిస్ట్, ఫోరెన్సిక్ సైకాలజిస్టు, ఆడియో-వీడియో గ్రాఫర్, నర్సులతో కూడిన బృందం ఈ పరీక్షలను నిర్వహిస్తుంది.

పాలీగ్రాఫ్

ఈ విధానం పాలీగ్రాఫ్ గా కంటే లైడిటెక్టర్గా సుపరిచితం. అయితే ఇది మందు కాదు. ఒక పరికరం. రక్త పీడనం, నాడి, శ్వాసక్రియ, శరీర కదలికలను ఈ పరికరం గుర్తిస్తుంది. నిందితుడిని ఈ పరికరానికి సంధానం చేసి ప్రశ్నలు అడుగుతారు. అప్పుడు అతనిలో పై శరీర ప్రక్రియల స్పందనలను బట్టి ఒక అంచనాకు వస్తారు. నిజం చెప్పినప్పుడు శరీర ప్రక్రియల్లో వచ్చే స్పందనలు, తప్పుదారి పట్టించే జవాబులిచ్చినప్పుడు శరీర ప్రక్రియల్లో వచ్చే స్పందనలు వేర్వేరుగా ఉంటాయి. ఇలా స్పందనలను అంచనా వేసి నిపుణులు మదింపు చేసుకుంటారు. అయితే దీనిని చాలా వరకు వ్యతిరేకిస్తారు. 1921లో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలోని జాన్ అగస్టస్ లార్సన్ అనే విద్యార్థి ఈ విధానాన్ని కనుగొన్నారు. బ్రిటనికా ఎన్సైక్లోపిడియా 2003లో రూపొందించిన 'మానవ జీవితంపై మంచి లేదా చెడు ప్రభావాలు చూపే గొప్ప ఆవిష్కరణల జాబితా'లో ఈ పాలీగ్రాఫ్కు కూడా చోటు దక్కింది. మనదేశంతో పాటు అమెరికా పోలీసులు, నిఘా విభాగాలు ఈ పరిజ్ఞానాన్ని వినియోగిస్తాయి. అయితే కోర్టులు వీటిని సాక్ష్యాలుగా అంగీకరించకపోయినా ఇజ్రాయిల్, ఆస్ట్రేలియా, యూరప్, కెనడాలలో ఈ పద్ధతి ఆచరణలో ఉంది.

బ్రెయిన్ మ్యాపింగ్

ఈ విధానానికి బ్రెయిన్ ఫింగర్ ప్రింటింగ్, పి 300 టెస్ట్ అనే పేర్లు కూడా వున్నాయి. 1995లో డాక్టర్ లారెన్స్ ఎ ఫర్వెల్ అనే న్యూరాలజిస్టు ఈ విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈ పద్ధతిలో మొదట నిందితుడిని ఇంటర్వ్యూ చేస్తారు. సమాచారం నిక్షిప్తం చేస్తారు. ఆ తర్వాతి దశలో నిందితుడి తలకు సెన్సర్లను అమర్చి సంబంధిత నేరానికి దగ్గరగా ఉన్న చిత్రాలను చూపించడం, శబ్దాలను వినిపించడం చేస్తారు. అప్పుడు అతని మెదడు నుంచి వెలువడే పి300 విద్యుత్ తరంగాలను సెన్సర్ నమోదు చేస్తుంది. ఆ చిత్రాలకు, శబ్దాలకు నిందితుడితో సంబంధముంటేనే ఈ పరికరం తరంగాలను గ్రహించి నమోదు చేస్తుంది. వాటిని విశ్లేషించి దర్యాప్తు సంస్థలు విచారణ సాగిస్తాయి.

'అ'శాస్త్రీయమే!

శాస్త్రీయ సత్య శోధన పరీక్షలుగా వీటికి పేరున్నా..అంతగా విశ్వసించదగ్గ పరీక్షలేమీ కాదని పలువురు నిపుణుల అభిప్రాయం. ఎందుకంటే ఇవన్నీ కూడా నిందితుడిని శారీరకంగా, మానసికంగా ప్రేరేపించి..సాధారణ స్థితిలో లేనప్పుడు నిర్వహించే పరీక్షలు. ఒకవేళ ఉన్నపళంగా ఉచ్ఛ్వాసనిశ్వాసలు, లేదా హృదయస్పందనలు, రక్త పీడనంలో మార్పులు అధికంగా చోటుచేసుకుంటే సదరు వ్యక్తి అసత్యాలు చెబుతున్నా..పాలీగ్రాఫ్లో రికార్డు అవుతాయి. మామూలుగా నిజాలు చెప్పినప్పుడే ఈ పరికరం ఇలాంటి రికార్డులు నమోదు చేస్తుంది. అదే సమయంలో ఏ వ్యక్తి అయినా ఆరోగ్యం సరిగాలేక అతని శ్వాస, రక్తపీడనం, ఇతర శరీర కదలికల్లో పెద్దగా స్పందన లేకపోతే అతను సత్యాలు చెబుతున్నా..పరికరంలో ఆ స్పందనలు రికార్డు కావు. అందువల్ల ఏ వ్యక్తి

ఇక థర్డ్ డిగ్రీ బాట!

ఈ శాస్త్రీయ పరీక్షలకంటే ముందు రాజులకాలంలో లాగా ఖైదీలను శారీరకంగా హింసించి నిజాలు చెప్పించేవారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సత్య శోధన పరీక్షలకు ఆస్కారం చాలా తక్కువైనందున విచారణాధికారులు థర్డ్ డిగ్రీ పద్ధతులు అవలంభించే అవకాశాలూ ఉన్నాయన్న ఆందోళన ఇప్పుడు వ్యక్తమవుతోంది. ఇలాంటి పద్ధతులు కొనసాగుతూనే ఉన్నాయని తరచూ పత్రికల్లో వార్తలు దర్శనమిస్తుంటాయి. శారీరకంగా, మానసికంగా తీవ్ర హింసకు గురిచేసి సమాచారం కక్కించడమే థర్డ్డిగ్రీ పద్ధతి. పట్టుకారతో గోళ్లు గుంజడం, జననాంగాలపై కాల్చడం, రక్తం చిమ్మేలా చితకబాదడం, ఒంటరిగా చీకటిగదిలో వేసి మనోవ్యధకు గురిచేయడం, ముళ్లగదతో బాదడం వంటివి. తలకిందులుగా వేళ్లాడదీసి ఎలుకలున్న సంచిని మూతికి కట్టడం వంటివి, చేతులు-కాళ్లు కట్టేసి, వంటిపై నూలుపోగు లేకుండా చేసి చిత్రవధ చేయడం వంటి వన్నీ థర్డ్డిగ్రీ కిందకే వస్తాయి. ఈ దృశ్యాల్లో అమెరికా జైళ్లలో సర్వసాధారణంగా కనిపిస్తుంటాయని ప్రతీతి. యుద్ధ ఖైదీలు, ఉగ్రవాద ముద్ర వేసి అమెరికా నిఘా సంస్థ సిఐఎ చేసిన వికృత చేష్టలకు ప్రపంచ మీడియా నివ్వెరపోయిన ఘటనలెన్నో ఉన్నాయి. ఈ థర్డ్ డిగ్రీ దృశ్యాలను మనం హాలీవుడ్ సినిమాలతో పాటు తెలుగు చిత్రాల్లోనూ చూడొచ్చు. ఆ మధ్య వచ్చిన 'అపరిచితుడు'లో హీరో విక్రమ్ను విలన్ ప్రకాశ్రాజ్ హింసించి నిజాలు చెప్పించడం వంటి ఒళ్లు గగుర్పొడిచే దృశ్యాలు థర్డ్ డిగ్రీకి చక్కని ఉదాహరణలు. అదేవిధంగా హాస్యనటులు బ్రహ్మానందం విచారణాధికారిగాను, అలీ చిత్రకళాకారుడిగా నవ్వులు పూయించిన 'సూపర్' చిత్రంలోని 'అబద్ధాల మిషన్' దృశ్యం ఎంతగా ఆకట్టుకుందో తెలియంది కాదు. ఈ హాస్యసన్నివేశాన్ని పాలీగ్రాఫ్ పరీక్షలకు ఉదాహరణగా చెప్పవచ్చు.

ఎక్కడెక్కడ?

నార్కో ఎనాలసిస్, బ్రెయిన్మ్యాపింగ్, పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రస్తుతం అహ్మదాబాద్, హైదరాబాద్, బెంగళూరులోని ఫోరెన్సిక్ ల్యాబ్లే అందుబాటులో ఉన్నాయి. దేశమంతటికీ ఈ మూడు కేంద్రాలే ఉండటంతో వీటిపై అధిక భారం పడుతోంది. కాగా ఈ భారాన్ని తగ్గించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ తరహా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గతేడాది ఆగస్టులోనే నిర్ణయించింది. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఇది పూర్తయితే ఉత్తర భారతావనిలో ఇదే మొదటిది అవుతుంది.



ఎవరెవరికి?

2003లో స్టాంపుల కుంభకోణంలో ప్రధాన నిందితుడైన అబ్దుల్ కరీం తెల్గీకి నార్కో ఎనాలసిస్ పరీక్షలు నిర్వహించారు. అలాగే ముంబయి వరుస బాంబు పేలుళ్ల-1993 కేసులో నిందితుడు, అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం ప్రధాన అనుచరుడైన అబు సలేంకు 2005 డిసెంబర్‌లో ఈ పరీక్షలు నిర్వహించారు. అనుమానిత ఉగ్రవాది ఇమ్రాన్ అలియాస్ బిలాల్‌కు 2007లో ఈ టెస్టులు జరిపారు. ఇదే సంవత్సరం నిఠారి హత్య కేసులో ప్రధాన నిందితుడైన సురేంద్ర కోలీకి ఈ తరహా పరీక్షలు నిర్వహించారు. కేరళలో సిస్టర్ అభయ హత్య కేసులో 2007 ఆగస్టులో ఫాదర్ థామస్ కొట్టూర్, జోష్ పూత్రిక్కాయిల్, సెఫీ తదితరలకు నార్కో ఎనాలసిస్ పరీక్షలు నిర్వహించారు. అయితే ఈ పరీక్షలకు సంబంధించిన దృశ్యాలను ఎడిట్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇటీవల కాలంలో గతేడాది అరుషి హత్యకేసులో ఆమె తల్లిదండ్రులైన రాజేష్ తల్వార్ దంపతులకు, నల్లధనం కేసులో కీలకపాత్రధారి అయిన గుర్రాల వ్యాపారి హసన్ అలీకి ఈ టెస్టులు నిర్వహించాలని సిబిఐ సంబంధిత కోర్టులకు విజ్ఞప్తి చేసింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన అనంతరం ఈ పరీక్షల నుంచి వీరితో పాటు చాలా మందికి ఉపశమనం లభించిందని చెప్పవచ్చు. ఇలా ఉపశమనం పొందినవారిలో రూ.ఏడు వేల కోట్ల ఆర్థిక కుంభకోణానికి సంబంధించిన సత్యం కంప్యూటర్స్ మాజీ అధినేత సత్యం రామలింగరాజు, అతని సన్నిహితుడు వి. శ్రీనివాసన్ ప్రముఖంగా ఉన్నారు. వీరి తర్వాత సొహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో నిందితుడైన డిజి వంజరా, అరుషి హత్య కేసులో రాజేష్, నుపుర్ తల్వార్‌కు, కృషి బ్యాంకు దివాలా కుంభకోణం కేసులో కొసరాజు వెంకటేశ్వరరావు తదితరులతో పాటు మావోయిస్టు నేత కోబాడ్ గాంధీ, గుజరాత్ ఆధ్యాత్మిక గురువు సంతోక్‌బెన్ జడేజా ఈ పరీక్షల నుంచి తప్పించుకునే వెసులుబాటు కలిగింది.

అబు సలేం

అయినా ఈ పరీక్ష విఫలమైతే అతను అబద్ధం చెప్పినట్లుగా పరిగణించేందుకు ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. అయితే ఇందులో అబద్ధం చెప్పడానికి కేవలం ఐదు శాతం మాత్రమే ఆస్కారం ఉంటుందని విచారణ, వైద్య రంగ నిపుణులంటారు. వీటిలో శాస్త్ర, న్యాయ సమ్మతుల విషయమెలా ఉన్నా అంతర్జాతీయంగా చాలా దేశాలు ఈ టెస్టులను అంగీకరించడం లేదన్న విషయం ఇక్కడ గమనార్హం. ఈ పరీక్షలు నిర్వహించే తీరుపైనా, వీటి న్యాయబద్ధతపైనా దశాబ్దాల తరబడి వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. వ్యక్తి స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్నాయని కొందరంటే..దోషులను శిక్షించేందుకు సహకరిస్తున్నందున కొనసాగించడమే మేలని మరికొందరి వాదన. ఈ పరీక్షలపై న్యాయబద్ధతను తేల్చాలంటూ అనేక మంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వాటిని పరిశీలించిన సుప్రీంకోర్టు 2008 జనవరిలో 25న తీర్పు ను వెలువరించకుండా రిజర్వు చేసింది. రెండున్నరేళ్లు గడిచిన అనంతరం గత ఏడాది మే5న ఈ పరీక్షలన్నీ రాజ్యాంగ విరుద్ధమని తేల్చి సంచలనాత్మక తీర్పు వెలువరించింది. నార్కో ఎనాలసిస్, బ్రెయిన్ మ్యాపింగ్, పాలీగ్రాఫ్ పరీక్షలు రాజ్యాంగ విరుద్ధమని తమ 251 పేజీల తీర్పులో ప్రధానన్యాయమూర్తులు జస్టిస్ కెజి బాలకృష్ణన్, జస్టిస్ ఆర్‌వి రవీంద్రన్, జెఎం పంచాల్‌తో కూడిన ధర్మాసనం విస్పష్టంగా తేల్చిచెప్పింది.

సుప్రీం తీర్పు

'క్రిమినల్ కేసుల్లోగానీ, ఇంకా ఏ ఇతరంగానైనా బలవంతపు పద్ధతుల్లో విచారణ చేయడమంటే అది వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే. ఇలాంటి పద్ధతులు ఉపయోగించడం వల్ల స్వీయ రక్షిత హక్కుకు విఘాతం కల్గించినట్టే. బలవంతంగా రాబట్టిన ఈ తరహా పరీక్షల ఫలితాలను సాక్ష్యాధారాలుగా అంగీకరించలేం. నేరం చేసినట్లుగా లేదా చేయనట్లుగా ఆ ఫలితాలు ధృవపర్చినా..రాజ్యాంగంలోని ఆర్టికల్ 20(3) ("ఏ నేరం కిందనైనా నిందితునిగా ఉన్న వ్యక్తి తనకు వ్యతిరేకంగా తానే సాక్ష్యం ఇచ్చేందుకు బలవంతపెట్టరాదు") కింద మాట్లాడటమా/మౌనంగా ఉండిపోవడమా ఎంచుకొనే వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించాలి. సమాచారాన్ని రాబట్టడంలో బలప్రయోగం నుంచి ఆర్టికల్ 20(3) రక్షణ కల్పిస్తుంది, అందువల్ల ఇలాంటి పరీక్షల ఫలితాలను సాక్ష్యాలుగా పరిగణించలేం. ఒక వేళ నిందితుని అనుమతితోనే ఈ పరీక్షలు నిర్వహించినా కూడా వాటి ఫలితాలను సాక్ష్యాలుగా పరిగణించరు. అయితే సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 27 ప్రకారం నిందితుని అనుమతితో చేసిన పరీక్షల ఫలితాల సహకారంతో ఏదైనా సమాచారం, మెటీరియల్‌ను అగీకరించవచ్చు' అని పేర్కొంది. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం తనకు వచ్చిన అనేక ఫిర్యాదులు, విజ్ఞప్తులను పరిశీలించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి తీర్పు రాస్తూ 'ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఇలాంటి పద్ధతులు ప్రయోగించడం అతని వ్యక్తిగత స్వేచ్ఛ హద్దులను ఉల్లంఘించినట్లు అవుతుంది. ఒక మనిషి మానసిక ప్రక్రియలో జోక్యం చేసుకొనేందుకు ఏ శాసనమూ సమ్మతించదు. తన నిర్దోషిత్వాన్ని కాపాడుకునే స్వేచ్ఛను హరించివేయడమే అవుతుంది' అన్నారు.

స్వచ్ఛంద పరీక్షలకు ఓకే

దర్యాప్తు సంస్థలకు, పోలీసులకు సుప్రీంకోర్టు తీర్పు తీవ్ర నిరాశ కలిగించినా..కాస్త ఉపశమనమూ ఇచ్చింది. స్వచ్ఛందంగా ఈ శాస్త్రీయ పరీక్షలకు అంగీకరించిన సందర్భంలో పరీక్షలు జరపవచ్చని తెలిపింది. ఇలా స్వచ్ఛంద అంగీకారం తెలిపేవారికి పాలీగ్రాఫ్, నార్కో ఎనాలసిస్, బ్రెయిన్ మ్యాపింగ్ పరీక్షల నిర్వహణకు జాతీయ మానవ హక్కుల సంఘం రూపొందించిన మార్గదర్శకాలను పాటించాలని కోర్టు ఆదేశించింది. అయితే ఈ పరీక్షల్లో వెలువడే ఫలితాలనూ సాక్ష్యాలుగా పరిగణించమని స్పష్టం చేసింది.

జాతీయ మానవ హక్కుల సంఘం మార్గదర్శకాలు

- తగిన అనుమతి లేకుండా ఏ పరీక్షనూ నిర్వహించరాదు.
- నిందితుడు పరీక్షలకు అంగీకరిస్తే వాటివల్ల కలిగే శారీరక, మానసిక, ఉద్వేగ ప్రభావాలను, న్యాయపర చిక్కులను అతనికి వివరించేందుకు ఆయన తరపు న్యాయవాదిని కచ్చితంగా అనుమతించాలి.
- దర్యాప్తు తీరును జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎదుట రికార్డు చేయాలి.
- పరీక్షలకు అంగీకరించిన వ్యక్తి విచారణ సమయంలో తన న్యాయవాదితో సంప్రదింపులు చేయొచ్చు.
- పోలీసులు సాధారణంగా తీసుకొనే నిందితుల వాంగ్మూలానికి సాక్ష్యాధారంగా గుర్తింపు వుంటుంది. అయితే ఈ పరీక్షల్లో వెల్లడైన ఫలితాలను

'నార్కో' కిట్



సాక్ష్యాధార వాంగ్మూలంగా పరిగణించబడదు.

- న్యాయవాది సమక్షంలో స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సంస్థ మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించాలి.
- పూర్తిస్థాయి వైద్య, విచారణ సాగిన తీరు, సేకరించిన సమాచారాన్ని కచ్చితంగా నమోదు చేయాలి.

మానవ హక్కులకే పెద్ద పీట

అయితే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఈ పరీక్షల శాస్త్రీయతను ఏవిధంగానూ ప్రశ్నించకపోవడం విశేషం. కేవలం మానవునిగా తన ప్రాథమిక హక్కులకు విఘాతం కలగకూడదన్న దృక్పథంతోనే ఉన్నతన్యాయస్థానం తన తీర్పునిచ్చింది. పలు అంతర్జాతీయ మానవ హక్కుల వేదికలు కూడా ఇదే విధంగా ఉద్ఘోషిస్తున్నాయి. మానవ హక్కులపై అంతర్జాతీయ ఒప్పందంలోని ఆర్టికల్ 3లో 'జీవించడానికి, స్వేచ్ఛగా తన వ్యక్తిత్వ భద్రతను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది' అని పేర్కొనగా అదే ఒప్పందంలోని ఆర్టికల్ 5లో 'భౌతికంగా లేదా మోటు పద్ధతుల ద్వారా లేదా శిక్షించడం ద్వారా ఎవరినైనా వేధించేందుకు, క్రూరంగా హింసించేందుకు ఏ ఒక్కరికీ అధికారం లేదు' అని స్పష్టంగా తెలిపింది. అలానే పౌర మరియు రాజకీయ హక్కులుపై అంతర్జాతీయ ఒడంబడిక-1966 (ఐసిసిపిఆర్)లోని ఆర్టికల్ 6(1) ప్రకారం..'ప్రతి మానవుడు తనకు తనుగా సగౌరవంగా జీవించే హక్కు కలిగివుంటాడు. న్యాయం ఈ హక్కును పరిరక్షించాలి. అతని జీవితాన్ని నిరంకుశంగా నాశనం చేసే హక్కు ఎవ్వరికీలేదు' అని పేర్కొంది. ఏ వ్యక్తికైనా అతను స్వేచ్ఛగా అనుమతి ఇవ్వనిదే వైద్య, శాస్త్రీయ పరీక్షలు నిర్వహించరాదని ఇదే ఒడంబడికలోని ఆర్టికల్ 7 చెబుతుంది. ఈ ఒప్పందంలోని ఆర్టికల్ 14(2) ప్రకారం..క్రిమినల్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి చట్టబద్ధంగా అతను దోషిగా నిరూపితమయ్యేవరకు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే హక్కు కలిగివుంటాడు. నిర్బంధ లేదా శిక్ష అనుభవిస్తున్న ఖైదీల రక్షణ కోసం ఐక్యరాజ్యసమితి 1988లో రూపొందించిన మార్గదర్శకాల్లోనూ హక్కుల రక్షణకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు.. వాటి ప్రకారం నిర్బంధంలో లేదా ఖైదుగా ఉన్న వ్యక్తిని తన నేరాన్ని, లేదా ఇతరుల నేరాలను ఒప్పుకునేలా..అతని పరిస్థితిని అనుచిత అవకాశంగా తీసుకోరాదు. అలాగే అదుపులో ఉన్న వ్యక్తిని హింసకు గురిచేసి, లేదా బెదిరించి, లేదా అతని సామర్థ్యానికి మించిన స్థాయిలో విచారించడం కానీ చేయరాదు. అదుపులో ఉన్న ఏవ్యక్తినైనా అతని అనుమతి ఉన్నా..అతని ఆరోగ్యానికి కీడు చేసే వైద్య, శాస్త్రీయ పరీక్షలు నిర్వహించరాదు.

శాస్త్రీయత, అశాస్త్రీయత పక్కనబెడితే మానవ హక్కులకు భంగం కలిగించకుండా దోషులను గుర్తించే సరికొత్త పద్ధతులు విచారణ రంగంలో ఆవిష్కృతం కావాలని ఆశిద్దాం.

★

సబ్-కాన్షస్ స్థితిలో అబద్ధం చెప్పలేరు

డా॥ కళ్యాణచక్రవర్తి
న్యూరో సైకియాట్రిస్ట్
మెడిసిటీ హాస్పిటల్స్
హైదరాబాద్.
ఫోన్ నం:
96666-95955

అబద్ధం చెప్పేటప్పుడు మానసికంగా, శారీరకంగా కొన్ని మార్పులు జరుగుతుంటాయి. అయితే ఇవి అందరికీ జరుగుతుంటాయని చెప్పలేం. మార్పులు మనిషి మనస్తత్వంపై ఆధారపడతాయి. కొంత మంది మానసిక స్థితి బలహీనంగా ఉంటుంది. అటువంటి వారిలో ఈ మార్పులు కనిపిస్తాయి. ముందుగా లైడిటెక్షన్ పరీక్ష చేస్తారు. ఆ తర్వాత నార్కో అనాలసిస్ పరీక్ష చేస్తారు.

లైడిటెక్షన్ పరీక్ష సందర్భంగా వీరిలో కనిపించే మార్పులు....

విచారణలో భాగంగా ప్రశ్నించినప్పుడు చెమటలు పడతాయి. ఎంత చెమట పట్టింది, చెమటలో ఎంత సోడియం, పొటాషియం ఉందో విశ్లేషిస్తారు. గుండె కొట్టుకునే వేగంలో మార్పులుంటాయి. శ్వాస తీసుకోవడంలోనూ మార్పులుటాయి. బేసిక్ మెటబాలిక్ రేటు శారీరక మార్పుల్లో ముఖ్యమైంది. మిగతా అవయవాలకు రక్తం ఎలా సరఫరా అవుతుందో బేసిక్ మెటబాలిక్ రేటు సూచిస్తుంది. ఒక మనిషి కచ్చితంగా అబద్ధం ఆడుతున్నాడని చెప్పలేం. ఇతను అబద్ధం ఆడే అవకాశముందని మాత్రమే చెప్పే వీలుంది. ఒక కేసులో లభించిన సాక్ష్యాల ఆధారంగా లైడిటెక్షన్ పరీక్షపై ఆధారపడకూడదు.

నార్కో అనాలసిస్ టెస్ట్

ఏ సమయంలో ఈ పరీక్ష చేశారనేదానిపై ఫలితం ఆధారపడి ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రకరకాల ప్రశ్నలు అడిగితే అతని మానసిక స్థితి ఆ ప్రశ్నలతోపాటు అటువంటి జవాబులకే అలవాటుపడుతుంది. అకస్మాత్తుగా ఒక వ్యక్తిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని మళ్లీ మళ్లీ అదే ప్రశ్నలు సంధిస్తే అనుకున్న సమాధానం రాదు. నార్కో అనాలసిస్ పరీక్షలో ఆ వ్యక్తికి నిద్ర వచ్చేందుకు ఒక విధమైన రసాయనం ఉన్న ఇంజక్షన్‌ను రక్తంలోకి ఎక్కిస్తారు. ఇది నిష్ణాతులైన మత్తు మందు వైద్యనిపుణులతో చేయిస్తారు. మనిషి మానసిక స్థితిని మూడు దశలుగా విభజించవచ్చు. కాన్షస్, అన్ కాన్షస్, సబ్-కాన్షస్. ఇంజక్షన్ ద్వారా ఆ వ్యక్తిని సబ్-కాన్షస్ స్థితిలోకి తీసుకొస్తారు. ఈక్రమంలో రసాయనం వేగంగా ఇస్తే పడుకుంటారు, నెమ్మదిగా ఇస్తే తెలివితో ఉంటారు. జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎక్కించాలి. సబ్-కాన్షస్ స్థితిలో ఉన్నప్పుడు ఆ వ్యక్తి అబద్ధం చెప్పడం చాలా కష్టమవుతుంది. నిద్ర మాత్రలు, మద్యపానం అలవాటున్న వ్యక్తులకు నార్కోఅనాలసిస్ పరీక్ష అంతగా పనిచేయకపోవచ్చు. ఇంజక్షన్ ఇస్తున్న సమయంలో ఆ వ్యక్తి మత్తులోకి వెళ్లినట్లుగా ప్రవర్తిస్తే వెంటనే పసిగట్టొచ్చు. రక్తపోటు, గుండె పల్స్‌రేటు, శ్వాస తీసుకునే రేటు తెలుసుకునే యంత్రాల ద్వారా వారు నిజంగానే మత్తులోకి వెళ్లారా లేదా నటిస్తున్నారా అనేది తెలుసుకోవచ్చు. సాధారణంగా యోగా, ప్రాణాయామపై గట్టి పట్టు ఉన్నవారు సబ్-కాన్షస్ స్థితిలో కూడా అబద్ధాలు చెప్పగలిగే అవకాశముంది. వీళ్లు అబద్ధాలు చెప్పినా శరీరంలో ఎలాంటి మార్పులుండవు. మొత్తం మీద నార్కో ద్వారా 80 నుంచి 90 శాతం నిజాలు రాబట్టే అవకాశముంది.

అమెరికాలో అవినీతికి తావుండదా?

అమెరికా పర్యటించిన అనేక మంది అక్కడ 'మన మాదిరి' అవినీతి ఉండదని చెప్పటం ఫ్యాషన్. అయితే 'అమెరికా మాదిరి' అవినీతికి కొన్ని తాజా మచ్చుతునకలివి. ప్రభుత్వ కాంట్రాక్టులు పొందేందుకు 'ఎక్సెంటూర్' అనే టెక్నాలజీ సేవల కంపెనీ ముడుపులు చెల్లించిన కేసు పరిష్కారానికి మూడు వందల కోట్ల రూపాయలు చెల్లించేందుకు అంగీకరించింది. టెండర్లను రిగ్గింగ్ చేసి అధిక ధరలకు పొందటం విచారణలో బయటపడింది. తాము తప్పేమీ చేయకపోయినా వివాదాన్ని పొడిగించటం ఇష్టం లేక డబ్బు చెల్లించేందుకు అంగీకరించామని ఎక్సెంటూర్ కంపెనీ చెప్పుకుంది. ఇలా గూగుల్ కంపెనీ 2,300, హూలెట్-పాకార్డ్ 253, ఇఎంసి 402, సిస్కో సిస్టమ్స్ 220, గూగుల్ కంపెనీ 230 కోట్లు చెల్లించి కేసుల నుంచి బయట పడ్డాయి. అదే మనకూ అమెరికాకూ తేడా అని చెప్పవచ్చు. అక్కడి ఫాల్స్ క్లెయిమ్స్ యాక్ట్ ప్రకారం అవినీతి అక్రమాలు రుజువైతే 15 నుంచి 30శాతం వరకు అవినీతి సొమ్మును తిరిగి రాబట్టటానికి అవకాశం ఉంది. కేసులు కూడా మనమాదిరి 'తరతరాల' పాటు వాయిదా పడవు. గూగుల్ నుంచి వసూలు చేసిన మొత్తం అమెరికా చరిత్రలో పెద్ద మొత్తాలలో ఒకటి.

మసీదులను కూల్చేది ఎవరు?

మన దేశంలో అయితే కాషాయదళాలని ఎవరిని అడిగినా చెబుతారు? కానీ కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే మసీదులు, చర్చిలను కూల్చివేస్తారని గతంలోనూ, ఇప్పుడూ తప్పుడు ప్రచారం జరుగుతోంది. అదే నిజమైతే రష్యాలో ఒక్క చర్చి, మసీదు కూడా ఉండి ఉండటానికి వీలులేదు. కానీ అక్కడ అవన్నీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. కమ్యూనిస్టు పాలనను కూలదోసిన తరువాత అక్కడ అధికారంలోకి వచ్చిన 'అపర ప్రజాస్వామికవాదులు' ఇప్పుడు మసీదులను కూల్చే పనిలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అమెరికాలో 9/11 దాడుల పదవ వార్షికోత్సవం సందర్భంగా 'మతంపై సోవియట్ దాడిలో సైతం తట్టుకొని నిలిచిన వందేళ్లనాటి మసీదును మాస్కోలో కూల్చివేశారని' మాస్కో టైమ్స్ పత్రిక రాసింది. మాస్కోలో 20లక్షల మంది ముస్లింలు ఉన్నారు. ఈ చర్య వివాదంగా మారటంతో అయితే గోడలకు పగుళ్లిచ్చినందును తామే కూల్చివేయమని కోరినట్లు 'ముఫ్తీలు' ప్రకటించటం విశేషం. న్యూయార్క్ ప్రపంచ వాణిజ్య కేంద్రంపై ముస్లిం తీవ్రవాదులు దాడి చేసి పది సంవత్సరాలు నిండిన రోజునే 'మసీదు'ను కూల్చివేయాల్సిన అవసరం ఏమిటని కొందరు ప్రశ్నించారు. అలాగా అనుకోకుండా అసలు ఎవరినీ సంప్రదించకుండా కూల్చివేశారని ఒక మతనాయకుడు తప్పించుకొనే సమాధానం చెప్పారు. గతంలో మాస్కో ఒలింపిక్స్ సందర్భంగా ఆ కట్టడం అడ్డం వచ్చినప్పటికీ అప్పటి కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వం మసీదుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసింది. గత ఇరవై సంవత్సరాలలో అధికారంలో ఉన్న కమ్యూనిస్టు వ్యతిరేక ప్రభుత్వాలు పురాతన వారసత్వ భవనాలను కూల్చివేయటం లేదా కారుచౌకగా తమ అనుయాయులకు కట్టబెట్టి హోటళ్లు, ఇతర వాణిజ్య సముదాయాలుగా మార్చివేసేందుకు అనుమతించాయి. అంతేకాదు కొత్తగా మసీదులను నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతివ్వటం లేదు. స్థానికులు వ్యతిరేకిస్తున్నారనే పేరుతో గతేడాది సెప్టెంబరు పదకొండున మాస్కో ఆగ్నేయ ప్రాంతంలోని టెక్స్టిల్షికి అనే ప్రాంతంలో నిర్మించిన ఒక మసీదును కూల్చివేశారు.

బెర్లుస్కోనీ

'ఏ'ం మనిషండీ బాబూ...

ప్రధానమంత్రిని లోక్‌పాల్ పరిధిలోకి తీసుకు వస్తే 'పాలనకు ఆటంకం' వస్తుందని మన కాంగ్రెస్ నాయకులు చెబుతుంటే 'ఇటాలియన్లు' పకా పకా నవ్వుతున్నారు. అసలు మా మాదిరి 'అవినీతిలో పుట్టి అవినీతిలో పెరిగి అవినీతితో బ్రతుకుతున్న' మా సిల్వియో బెర్లుస్కోనీ పదవిలో ఉండగానే 'ఎన్ని కేసులను' ఎదుర్కోలేదు, ఇటలీ పాలనకు ఏమైనా అయిందా? దీర్ఘకాలం పదవిలో ఉన్న ఇటలీ ప్రధానుల్లో మూడవ వ్యక్తిగా, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 2001-06 మధ్య ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసిన తొలి ఇటలీ ప్రధానిగా, ఇప్పుడున్న జి8 దేశాధినేతల్లో అత్యధికకాలం పదవిలో ఉన్న వ్యక్తిగా, ఇప్పటికే 'రికార్డు' నెలకొల్పాడంటున్నారు. ఒక వైపు 'శృంగార కుంభకోణాలను' మరోవైపు ఆర్థిక సంక్షోభాన్ని సవ్యసాచి మాదిరి ఎదుర్కొనటం లేదా? మీ ప్రధాని మాదిరి ముంగిలా నోరు తెరవకుండా ఉన్నాడా? అని దబాయిస్తున్నారు. అయితే మిలన్ కోర్టుల న్యాయమూర్తులు బెర్లుస్కోనీ మీద కక్ష కట్టి 'కోర్టు పక్షిగా' మార్చారని ఆయన మద్దతుదార్లు ఆడిపోసుకుంటారనేది వేరే విషయం. ఇప్పుడు బెర్లుస్కోనీ మీద మూడు కేసుల విచారణ జరుగుతోంది. ఒకటి అవినీతి, రెండవది పన్నుల అక్రమం, సొమ్మిచ్చి మైనర్ బాలికతో శృంగారం జరిపాడన్నది మూడవది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇటలీకి 23 మంది ప్రధానులుగా పనిచేశారు. డెబ్బైనాలుగు సంవత్సరాల ఈ తాతయ్య తాజాగా మరో కేసును ఎదుర్కొనేందుకు 'సిద్ధం' అవుతున్నాడు. బెర్లుస్కోనీ, ఆయన అనుచరులకు 'అమ్మాయిలను' సరఫరా చేసే బ్రోకర్లంటూ ఎనిమిది మందిపై ఇటలీ పోలీసులు తాజాగా కేసు దాఖలు చేశారు. మా పెద్దమనిషి పనులేంటీ, ఈ కేసులేంటీ అసలు మా ప్రభుత్వం 2013 గడువు వరకు ఉంటుందా అని నార్తరన్ లీగ్ అనే సంకీర్ణ భాగస్వామ్య పక్షం నెత్తి కొట్టుకుంటోంది. బెర్లుస్కోనీ చైనా పర్యటనకు వెళ్లినపుడు ఒక అమ్మాయిని దౌత్యవేత్తల వీసాపై రప్పించుకున్నట్లు బయట పడింది. స్నేహపూర్వకంగా నిర్వహించిన పార్టీలకు అమ్మాయిలు రావటమే నేరమా? వారిని మరో రకంగా వర్ణిస్తారా అంటున్నారు బెర్లుస్కోనీ లాయర్లు. పద్దెనిమిది సంవత్సరాలు దాటిన వారు పడుపు వృత్తి చేపట్టటానికి ఇటలీలో చట్టం అనుమతిస్తున్నది. అందువలన ఎవరైనా ప్రభుత్వం వద్ద 'పనులు' చేయించుకోవాలంటే చట్టబద్ధంగానే 'అమ్మాయిలను సరఫరా' చేయించుకోవటం ఇటలీలో సర్వసాధారణం. ఇటాలియన్ ఎయిర్‌లైన్స్ అలిటాలియా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు 2008 సెప్టెంబరులో ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో ఒక సమావేశానికి హాజరు కావాల్సిన బెర్లుస్కోని ఒకమ్మాయి దొరకగానే దానిని రద్దు చేసుకున్నాడు. ఇదేంపని సార్ అంటే నేను పార్ట్ టైమ్ ప్రధానినంటూ ఇచ్చిన జవాబు కూడా టేపులో రికార్డయింది. ఇలాంటి వాటన్నింటికీ రాజీనామా అంటే రోజుకు ఎన్నిసార్లు చెయ్యాలి, మీ ఇష్టం ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్నాడు. ఈ పెద్దమనిషి నోరు తెరిస్తే 'ఏ' సర్టిఫికెట్ మాటలే వస్తాయి. చివరికి తోటి దేశాధినేతలను కూడా వదలడు. ఇటలీ ప్రధాని తమ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ గురించి బూతు పదజాలంతో తూలనాడాడని జర్మనీ పత్రిక 'బిల్డ్' తాజాగా రాసింది.

- ఎం. కోటేశ్వరరావు

చిన్న కథ

క్యూ చేసిన మేలు

ఆఫీసు నుండి ఇంటికి రాగానే తాళం స్వాగతం పలికింది. శ్రీమతి ఏదైనా పనిమీద బయటికి వెళ్లుంటుందని, మారుతాళంతో లోపలికెళ్లా. కాస్త మొహం కడుక్కుని వంటగదిలోకెళ్లా. ఇన్‌స్టెంట్ బ్రూ కాఫీ రెండు కప్పులు తయారు చేసి ఫ్లాస్కులో పోశా. నా ఉద్దేశ్యం శ్రీమతి రాగానే ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగాలని. ఇంతలో హమ్మయ్య అంటూ వచ్చి పక్కనే సోఫాలో కూలబడింది నా శ్రీమతి.

పైట చెంగుతో మొహం తుడుచుకుంటూ "మీరొచ్చి ఎంత సేపయింది?" అడిగింది.

"పది నిమిషాలు" సమాధానం చెప్పి కిచెన్‌లోకెళ్లా. ఫ్లాస్కు, రెండు కప్పులు తెచ్చి టీపాయ్ మీద పెట్టాను.

"కాఫీ కలిపేశారా?" అనుకుంటూ రెండు కప్పుల్లో పోసింది. ఇద్దరం కాఫీ తాగుతున్నాం.

"అలసిపోయినట్లు కనిపిస్తున్నావ్. ఏమైంది?" అడిగాను.

"అలసిపోయానని నెమ్మదిగా అంటారేం? విపరీతంగా అలసిపోయా. కరెంటు బిల్లు కట్టడానికి వెళ్లానా! అక్కడ క్యూలో పదిహేను మంది ఉన్నారు. నా వంతు వచ్చేసరికి గంటపైనే పట్టింది. బిల్లు కట్టే కౌంటర్ ముందు ఫ్యాన్ కూడా లేదు. చాలా చిరాకనిపించింది" అంది.

నేను శాంతంగా వింటున్నాను. ఆమె ఇంకా చెప్పుకుపోతోంది.

"నిన్న ఫోన్ బిల్లు కట్టడానికి గంటన్నర క్యూలో నిలబడేసరికి నా ఓపిక నశించింది. మొన్న బాబుకి కడుపునొప్పి వస్తే హాస్పిటల్‌కు తీసుకెళ్లాను. నేనేమో చాలా తొందరగా వెళ్లాననుకున్నా. కానీ అప్పటికే క్యూలో పదిమంది ఉన్నారు. ఇక నావంతు వచ్చేసరికి గంటన్నర పైనే పట్టింది. ఏదైనా ఈ క్యూల్లో గంట తరబడి నిలబడి ఎదురు చూసే ఓపిక నాకు లేదు. మీకు ఆఫీసు టైము, ఈ కరెంటు, ఫోను బిల్లులు కట్టే సమయం ఒకటే కావడం వల్ల వాటి పని నామీద పడుతోంది" అంది బాధగా.

"అలా అనుకుంటే ఎలా? మనలా వచ్చినవాళ్లే ఆ క్యూలోని వారంతా. మనలాగే అందరూ, అందరిలాగే మనమూ అనుకుంటే అసలు బాధే వుండదు. అన్నట్లు నేను ఏ.టి.ఎం కి వెళ్లి డబ్బు డ్రా చేసుకుని ఓ పావుగంటలో వస్తాను" అని లేచాను.

ఎటిఎం పక్క వీధిలోనే ఉంది. కానీ అక్కడా ఇరవై మంది క్యూలో ఉన్నారు. మొదటి పదిమంది చాలా త్వరగా వచ్చారు. నా వంతు వచ్చేసరికి ఎక్కువ సమయం పట్టదనుకున్నాను. కానీ నిరాసే ఎదురైంది. వెయ్యి, ఐదొందల నోట్లు అయిపోయినట్లున్నాయి. అన్నీ వందనోట్లే వస్తున్నాయి. అందువల్ల ఎక్కువ డబ్బు అవసరమైన వాళ్లు రెండు మూడు సార్లు డ్రా చేసి, ఆ నోట్లన్నీ లెక్కపెట్టేసరికి చాలా ఆలస్యమైంది. నేనూ డబ్బు డ్రా చేసి లెక్కపెట్టుకుని, ఇంటికొచ్చేసరికి గంటన్నర అయింది.

ఇంటికి చేరుకోగానే మా ఆవిడ "పావుగంటలోనే తిరిగొస్తానన్నారు. ఇంత ఆలస్యమైందేంటండీ" అడిగింది.

జరిగిందంతా చెప్పాను. "గంటన్నర నిలబడితే మీకు విసుగనిపించలేదా? ఏమో బాబు. మీలాగ నేను గంటలు గంటలు నిలబడలేకపోతున్నాను" అంది.

"నువ్వు అలా అంటున్నావు గానీ, ఒకసారి క్యూలో నిలబడడం వల్ల మనకి చాలా మేలు జరిగింది తెలుసా?" అన్నాను.

"ఏంటి మీరంటున్నది? క్యూలో నిలబడడం వల్ల మేలు జరిగిందా? అదెలా, ఎప్పుడు?" ఆశ్చర్యంగా అడిగింది.

"పోయిన వేసవి సెలవుల్లో నాకు విజయవాడ నుండి హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది కదా! అప్పుడు హైదరాబాద్ రావడానికి రైల్వే టిక్కెట్లు ఇచ్చే కౌంటర్ దగ్గరికెళ్లాను. అక్కడ క్యూలో చాలా మంది ఉన్నారు. రాత్రి పదయింది. రెండు గంటల తర్వాత చూస్తే కౌంటర్ నుండి మూడో వ్యక్తిగా ఉన్నాను. అప్పుడే అక్కడికి ఒకతను వచ్చాడు. ఆయనకి అరవైఏళ్ల పైనే ఉంటాయి. టిక్కెట్ తీసుకోమని కౌంటర్ దగ్గరున్న వ్యక్తికి డబ్బివ్వబోయాడు. కానీ అతను 'నేను రెండు గంటలు క్యూలో నిలబడ్డ తర్వాత కౌంటర్ దగ్గరికొచ్చాను. ఒక్క నిమిషంలో తేలిగ్గా టిక్కెట్ వస్తుందనుకుంటున్నారా? వెళ్లి క్యూలో నిలబడండి' కటువుగా అన్నాడు.

ముసలాయన నా ముందున్న వ్యక్తిని కూడా అలాగే అడిగాడు. అతనూ ముక్తసరిగా వీలుపడదన్నాడు. అప్పుడా ముసలాయన నా వంక ఆశగా చూశాడు. ఆయన అవస్థ చూసేసరికి నాకు జాలేసింది. ఎలాగైనా ఆయనకి సహాయం చేద్దామనుకున్నాను. ఆయనకి కూడా టిక్కెటు తీసుకుంటానని బయటికి చెప్తే, నా వెనకున్నవాళ్లు దెబ్బలాడతారనిపించింది. ఆయనకు మాత్రమే అర్థమయ్యేటట్లు నా ఉద్దేశ్యాన్ని ఆయనకి సైగ చేశాను. నా వంతు వచ్చినప్పుడు హైదరాబాదుకి రెండు టికెట్లు తీసుకుని ఒకటి ఆయన చేతికిచ్చాను. పెద్దాయన టిక్కెట్ డబ్బు నా చేతికిచ్చి 'సమయానికి సహాయం చేశావు బాబూ... నీకు చేతులెత్తి ...' అని చేతులు జోడించబోయాడు. ఆయన చేతులు పట్టుకుని "మీరు పెద్దవారు. నాకు చేతులు జోడించకూడదు. పెద్దవయసులో టిక్కెట్ కోసం అవస్థ పడుతుంటే చూడలేక సహాయం చేశాను. అంతకుమించి ఏమీ లేదు" అన్నాను.

"అదంతా నీ మంచితనం నాయనా" అన్నాడతను. మేమిద్దరం బస్సులో పక్కపక్కనే కూర్చున్నాం.

"పెద్దవారై వుండి ఇలా ఒంటరిగా ప్రయాణం చేస్తున్నారెందుకు?" అడిగాను.

"విజయవాడలో ఉన్న మా అమ్మాయి వాళ్లింటికి వచ్చి వెళ్తున్నాను. హైదరాబాద్‌లో నా భార్య, కొడుకు ఉన్నారు. ఇలా ఒంటరి ప్రయాణాలు నాకలవాటే. కాకపోతే ఇప్పుడు వేసవి సెలవుల కారణంగా ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉంది. అందుకే టిక్కెట్ కోసం శ్రమపడాల్సి వచ్చింది. అన్నట్లు నువ్వేం చేస్తుంటావు? హైదరాబాద్‌లో ఎక్కడికి వెళ్లాలి" అడిగాడు.

"విజయవాడ ఎల్.ఐ.సిలో చేస్తున్నాను. హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. అక్కడ ఓ ఇల్లు చూసుకుని నా భార్యా కొడుకుని తీసుకురావాలి" అన్నాను.

"మా ఇంట్లో ఓ పోర్షన్ ఖాళీగా ఉంది. అది మీకు సరిపోతుందేమో! నాతో వచ్చి ఇంటిని చూసుకో" అన్నాడాయన.

అంతకంటే సంతోషం ఏముంది? ఆయనతో వెళ్లి ఇల్లు చూశాను. అన్ని సౌకర్యాలతో చాలా బాగుంది. వెంటనే ఓకే చెప్పాను. ఇప్పుడు మనం వుంటున్నది ఆ ఇంట్లోనే" అన్నాను.

"అంటే మన ఇంటి యజమానే ఆ ముసలాయనన్నమాట. ఈ విషయం మీరెప్పుడూ చెప్పలేదే" అంది.

"ఇప్పుడు సందర్భం వచ్చింది కాబట్టి చెప్పాను. దీన్ని బట్టి నువ్వేం గ్రహించావు?"

"క్యూలో నిలబడడం వల్ల మేలే జరిగిందని" అంటూ నవ్వింది.

- కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి

అశాస్త్రీయాంశాలపై అక్షరయుద్ధం!



'ఆకాశం నుండి దేవుణ్ణి, భూమి పైనుండి మతాన్ని తరిమి వేయండి' అంటాడు లెనిన్ ఒక సందర్భంలో... మానవ చరిత్ర అధ్యయనం ద్వారా విజ్ఞాన గ్రంథాల్లోని ఎన్నో అంశాలను మనం తెలుసుకోగలం. "నువ్వు చదివిన పుస్తకాలేమిటో చెబితే నువ్వేమిటో చెబుతా.. నువ్వు మళ్లీ మళ్లీ చదివిన పుస్తకాలేమిటో చెప్పు. నీ గురించి నేను మరింత కచ్చితంగా చెబుతా" అంటాడు ఫ్రాంకీయిస్ మారిన్. భారత తత్వ శాస్త్ర చరిత్రలో ఉన్న భౌతికవాద ధోరణులను గుర్తుపట్టాలంటే ముఖ్యమైన ఇబ్బంది భౌతికవాద గ్రంథాలు అసలు లేకపోవడం...ఆ మహత్తర పనిని దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ చేశాడు. అధ్యయన పద్ధతి అంటే ఏంటో శాస్త్రీయంగా నిర్వచించాడు. మన తత్వశాస్త్ర చరిత్రలో భౌతిక వాదాన్ని, భౌతికవాదపు ఛాయలనూ, పసిగట్టి విశ్లేషించి సంగ్రహించడం ఈ పుస్తకం పెట్టుకున్న లక్ష్యం. మానవ భావనా చరిత్రలో 'లోకాయత' అద్భుతమైన పాత్ర నిర్వహించింది. ఊహల నుండి, భ్రమల నుండి మానవుని వాస్తవిక కృషివైపు దృష్టి మరల్చిన శక్తులలో లోకాయత ఒకటి. లోకాయత అంటే ఇహ లోక దృష్టి. ఆదిమ భౌతిక వాదం అన్నమాట. చాందోగ్య ఉపనిషత్ లాంటి ప్రాచీన గ్రంథాల్లోని పలు విషయాలు శాస్త్రీయ కోణంలో చటోపాధ్యాయ విశ్లేషించారు. మన ప్రాచీన సాహిత్యంలోని నిగూఢమనిపించే భావాలు బహుప్రాచీన విశ్వాసాల అవశేషములు ఉండొచ్చుని... వేల సంవత్సరాల క్రితం ఉన్న మన పూర్వీకుల భావనా ప్రవర్తనను ప్రతి ఫలిస్తాయి" అంటాడు మోర్గాన్...అనేక తెగల, జాతుల, వివిధ కాలాలకు చెందిన పరిస్థితులను అధ్యయనం చేయడం ద్వారా ప్రాచీన చరిత్రనూ, మన అతి ప్రాచీన పూర్వీకుల స్థితి గతులను తెల్సుకోవాలి. అశాస్త్రీయ భావాల్ని త్యజించాలి. 650 కోట్ల జనాభా ఉన్న ఈ భూమండలంలో అవిద్య, అజ్ఞానం, పేదరికం కొన్ని వందల కోట్ల మందిని ఇబ్బందుల్లోకి... నేటి 'అణు' యుగం నెట్టి ఉంది. ఇది బాధాకరం. 110 కోట్లమందికి తాగునీరు లేదు. 260 కోట్లమందికి పారిశుధ్య సౌకర్యాలు లేవు. 100 కోట్ల మంది నిరక్షరాశ్యులు, 125 కోట్లమంది అన్నార్తులు. వ్యక్తిగత ఆస్తి గల వ్యవస్థలో మానవుడు గతితార్కిక సూత్రాలను, ప్రకృతి - సమాజాల పరిశీలనను, విజ్ఞానాన్ని, ప్రపంచ గమనాన్ని, సామ్రాజ్య వాదాన్ని, దోపిడీ శక్తుల్ని మూఢాచారాల్ని తెలుసుకోలేకుంటే... చీకటి రాజ్యమే- బానిస యుగ సమాజమే- పునరావృతమౌతుంది. అధ్యయనం చేయాల్సిన గ్రంథాల్లో 'లోకాయత' అతి ముఖ్యమైనది.. అవసరమైనది. ఇంత మంచి ప్రయత్నం చేసిన ప్రజాశక్తి బుక్ హౌస్‌కు ధన్యవాదాలు చెప్పి తీరాలి.

లోకాయుత, మూల రచయిత : దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ, అనువాదం : హరిపురుషోత్తమరావు, పేజీలు : 192, వెల :70/-, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్- 20.

- తంగిరాల చక్రవర్తి

కొత్త పుస్తకాలు

కంటతడి పెట్టించే కథలు...

పంతులు జోగారావు కథలు చదువుతుంటే కంటతడి పెట్టకుండా ఉండలేం. ఎందుకలా అంటే ఆయన కథలు చాలా వరకూ విషాదాంతాలే! మధ్యతరగతి, అంతకన్నా అట్టడుగుస్థాయి వారి జీవితాల్లో ఉన్న విషాదాన్ని తన కలంలో నింపుకుని రాశారేమో అన్నట్లున్నాయి ఆ కథలు. ఎంతో సహజంగా మన ఇంట్లో జరిగిన ఘటననే ఆయన కథగా మలిచారనిపిస్తుంది. ఆ కథలోని పాత్రల గుండెను గుండెకు ముడిపెట్టడం.. చదువుతున్న పాఠకుల గుండెనూ వాటితో పెనవేయడం.. రచయిత ప్రత్యేకత. 'మనిషన్నాక కాసింత కలా పోసన ఉండాలి' అని ముత్యాలముగ్గు సినిమాలో రావుగోపాలరావు డైలాగ్ ఎలా మర్చిపోలేమో.. ప్రతి మనిషి గుండెలో తడి ఉందని ప్రతి కథలో నొక్కి చెప్పారు రచయిత. 'అమ్మా, బళ్లోకి వెళ్లనే' అనే కథలో కింది మధ్యతరగతి కుటుంబ జీవనాన్ని మన కళ్ల ముందుంచారు. ఈ కథలో రాసినవన్నీ ఎంత నిజమో.. సూరిబాబు పాత్ర చుట్టాలొస్తే మంచి భోజనం చేయొచ్చునుకోవడమూ అంతే సత్యం. ఆ కథ ఆద్యంతం గుండెను పిండివేస్తుంది. ఎన్నో వాస్తవ ప్రతిబింబాలు ఈ కథలో మన కళ్లముందుంటాయి. 'అల్లుడోడు' కథలో అల్లుడు డిమాండ్లు ఎలా ఉంటాయో.. అవి తీర్చడానికి పేద అత్తామామా పడే ఇబ్బందుల్ని కళ్లకు కట్టారు. అంతటిది ఆగిపోకుండా ఆ పేద వృద్ధ అత్త చేత అల్లుడు డిమాండుకు, భర్త పెత్తనానికి లొంగక మద్యానికి వ్యతిరేకంగా రచయిత తిరుగుబాటు చేయించిన తీరు సముచితంగా అనిపించింది. 'గెలుపు' కథలో స్నేహితుల మధ్య అపురూప బాంధవ్యాన్ని ఎంతో వైవిధ్యంగా వర్ణించారు. తన పేదరికం గురించి స్నేహితునికి తెలియకూడదన్న తపనను 'రామం' పాత్రలో ఎంతో హృద్యంగా కూర్చారు రచయిత. ఈ కథలోని కొన్ని సన్నివేశాల్లో రామం పాత్ర మనమే అన్నంత అనుభూతి కలుగుతుంది. 'బొమ్మల చొక్కా' కథలో 'కొడుకు నారాయణ ఆశపడిన బొమ్మల చొక్కా కొనేందుకు ఆ తండ్రి ఒకపూట పస్తుండి డబ్బులు కూడేయడం కంటతడి పెట్టిస్తుంది. పుస్తకం కొనుక్కోకుండా కొత్త చొక్కా వేసుకొచ్చినందుకు మాస్టారుతో దెబ్బలు తింటాడు నారాయణ. తర్వాతిరోజు చిరిగిన చొక్కాతో నారాయణ బడికెళ్లడంతో కథను ముగించిన తీరు కన్నీరు తెప్పిస్తుంది. 'నరమేధం జరుగుతోంది' కథలో ప్రశ్నాపత్రాల లీకేజీ, విదేశాల్లో ఉద్యోగాలంటూ చెప్పి డబ్బులు పోగొట్టుకుంటూ, ఎలా మోసగింపబడుతున్నారో తెలియజేస్తూ నడిపిన కథనం వాస్తవంగా ఉంది. అలా మోసగింపబడ్డవారు ఆత్మహత్యలు చేసుకోవడంతో కథ ముగించారు. అయితే ఆత్మహత్యలు పరిష్కారం కాదు అంటూనే 'ఇలా ఎందుకు జరుగుతుంది?' 'ఏమో' అంటూ ఆఖరులో ముక్తాయింపు ఇవ్వడం ఏమాత్రం సబబుగా లేదు. ఇలా ఈ కథా సంకలనంలోని 24 కథలూ కంటతడి పెట్టించేవి.. మన చుట్టూ జరిగే సహజ జీవన చిత్రాలు.. అంటే అతిశయోక్తి కాదు. అందుకే ఈ కథా సంకలనానికి 'గుండె తడి' అన్న పేరు ఎంతో సముచితంగా ఉంది.

గుండె తడి కథలు, రచయిత : పంతులు జోగారావు, వెల : రూ.75, పేజీలు: 156, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

- శాంతిశ్రీ



భగవతీ గీత

చలసాని వెంకట సుబ్బారావు

పేజీలు : 96, వెల : 50/-

ప్రతులకు :

నవభావన,

విశాలాంధ్ర బుక్‌హౌస్,

ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.

స్థిత ప్రజ్ఞుని జీవయాత్ర

చలసాని వెంకట సుబ్బారావు

పేజీలు : 108, వెల : 120/-

ప్రతులకు :

శ్రీ చలసాని వెంకట సుబ్బారావు

యం.ఐ.జి - 18, హౌసింగ్ బోర్డు కాలనీ,

మేడ్చల్, రంగారెడ్డి జిల్లా - 501401.



డెర్బీ చికెన్

కావలసిన పదార్థాలు

కోడి - 1, టమాటా సాస్ - 1 కప్పు
వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్లు
కారం - 1 1/2 టీ స్పూను
ఉప్పు - తగినంత, కొత్తిమీర - 1 కట్ట
గరం మసాలా - 1 స్పూను
నూనె - 3 టేబుల్ స్పూన్లు
మిరియాల పొడి - 1 టీ స్పూను

స్టఫింగ్ కోసం

ఉడికించిన గుడ్లు - 2, కోడిగుడ్లు - 2
బ్రెడ్ ముక్కలు - 10, ఉప్పు - తగినంత, ఉల్లిపాయలు - 2

తయారు చేసే విధానం

శుభ్రం చేసిన కోడి ఉదరం భాగంలో చాకుతో నిలువుగా కోసి లోపలి భాగమంతా తీసేయాలి. కాళ్లు అలాగే ఉంచాలి. దానికి ఉప్పు పట్టించి అరగంట ఉంచాలి. టమాటా సాస్‌లో వెల్లుల్లి పేస్ట్, కొత్తిమీర, ఉప్పు, మసాలా దినుసులు వేసి కలపాలి. దీన్ని కోడికి పైనా, లోపల బాగా పట్టించి పావుగంట ఉంచాలి.

స్టఫింగ్ తయారీ

బ్రెడ్ ముక్కల పొడిలో కోడిగుడ్లసొన కలపాలి. ఉడికించిన కోడిగుడ్డు ముక్కలు, ఉప్పు, టమాటా సాస్‌తో చేసిన మసాలా, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు కలపాలి. ఈ మిశ్రమాన్ని చికెన్ పొట్టలో పెట్టి మందపాటి సూదీదారంతో అంచులు కుట్టాలి. దీన్ని 180 డిగ్రీల సెంటీగ్రేడు దగ్గర 20 నిమిషాలు బేక్ చెయ్యాలి. అంతే డెర్బీ చికెన్ రెడీ. ఇది చేయడానికి కొంచెం కష్టమే కానీ చాలా రుచిగా ఉంటుంది.

ఫిష్ కోల్లెట్

కావలసిన పదార్థాలు

చందువా చేప ముక్కలు - 4, పాలు - 1 కప్పు
ఉల్లిపాయ - 1, మిరియాల పొడి - 1 1/2 టీ స్పూను
నిమ్మరసం - 1 టీ స్పూను, మైదాపిండి - 4 టీ స్పూన్లు
బ్రెడ్ పొడి - 6 టీ స్పూన్లు, కోడిగుడ్డు - 1
ఉప్పు - తగినంత, నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

చందువా చేపలో ముల్లు తీసి ముక్కలు కోసి శుభ్రంగా కడగాలి. వెడల్పాటి ప్లేటులో పాలుపోసి అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, మిరియాల పొడి, నిమ్మరసం, ఉప్పు వేసి ఉంచాలి. అందులోనే చేపముక్కలు వేసి అరగంట నానబెట్టాలి. తర్వాత ఈ ముక్కల్ని వరుసగా కోడిగుడ్డు సొన, జారుగా కలిపిన మైదాపిండిలో ముంచి తీయాలి. తర్వాత బ్రెడ్ పొడిలో దొర్లించాలి. వీటిని కాగిన నూనెలో ఎర్రగా వేయించి టమాటా సాస్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి.



చికెన్ కర్రీ

కావలసిన పదార్థాలు

చికెన్ - పావుకేజీ
బోన్‌లెస్ చికెన్ - పావుకేజీ
ఉల్లిపాయలు - 2, పచ్చిమిర్చి - 4
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 టీ స్పూన్లు
కారం - 1 1/2 టీ స్పూను
పెరుగు - 1 కప్పు
టమాటా గుజ్జు - అరకప్పు
ఉప్పు - తగినంత
ధనియాల పొడి - 1/2 టీ స్పూను
జీలకర్ర పొడి - 1/2 టీ స్పూను, గరం మసాలా - 1/2 టీ స్పూను
గసగసాల పేస్టు - 1 టీ స్పూను, జీడిపప్పు పేస్టు - 2 టీ స్పూన్లు
కొత్తిమీర - 1 చిన్నకట్ట, నూనె - 2 టేబుల్ స్పూన్లు

తయారు చేసే విధానం

బోన్‌లెస్ చికెన్‌ని ఖైమా కొట్టించుకోవాలి. మామూలు చికెన్‌ని కడిగి పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు, ఉప్పు కలిపి నాననివ్వాలి. గిన్నెలో నూనె కాగిన తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కల్ని దోరగా వేయించాలి. చికెన్ ముక్కల్ని కూడా అందులో వేయాలి. ఉప్పు, కారం, ధనియాల పొడి వేసి కలియదిప్పి ఉడికించాలి. కొద్దిగా ఉడికాక ఖైమా, టమాటా గుజ్జు, జీలకర్ర పొడి, గరం మసాలా కలిపి పావుగంట ఉడికించాలి. దించేముందు గసగసాల పేస్టు, జీడిపప్పు పేస్టు, కొత్తిమీర చల్లుకోవాలి.

అపోలో ఫిష్

కావలసిన పదార్థాలు

కొరమీను చేప - అరకిలో, ఉప్పు - తగినంత
కారం - 1 టీ స్పూను, మిరియాల పొడి - 1/2 టీ స్పూను
నిమ్మరసం - 2 టీ స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్టు - 1 టీ స్పూను
చిల్లీ సాస్ - 3 టీ స్పూన్లు, అజనమోటో - అర టీ స్పూను
కోడిగుడ్డు - 1, కార్న్‌ఫ్లోర్ - 4 స్పూన్లు
మైదాపిండి - 4 స్పూన్లు, నూనె - వేయించడానికి సరిపడా
కరివేపాకు - 4 రెమ్మలు, పచ్చిమిర్చి - 10, పెరుగు - 1 కప్పు

తయారు చేసే విధానం

కొరమీను చేపముక్కలను శుభ్రం చేసి ఉప్పు, కారం, మిరియాల పొడి, నిమ్మరసం, అల్లం వెల్లుల్లి పేస్టు, చిల్లీసాస్, అజనమోటో కలిపి అరగంట నానబెట్టాలి. కోడిగుడ్డు సొన, కార్న్‌ఫ్లోర్, మైదాపిండి కలిపి పెట్టుకోవాలి. ఈ మిశ్రమంలో నానబెట్టిన చేప ముక్కల్ని ముంచాలి. కాగిన నూనెలో ఒక్కొక్క ముక్కనే ఎర్రగా వేయించాలి. చివరిలో కొద్దిగా నూనె ఉంచుకుని అందులో పచ్చిమిర్చి, కరివేపాకు వేయించాలి. అందులోనే పెరుగు, కొంచెం కారం కూడా వేసి ఉడికించాలి. తర్వాత వేయించిన చేప ముక్కల్ని అందులో వేసి ముక్కలకు పెరుగు పట్టి నీరంతా ఇగిరిపోయే వరకు కలియదిప్పాలి.



బాలస్నేహాలు

ఏమేం వున్నాయ్?

ఫ్రెండ్స్.. ఏంటలా విచిత్రంగా చూస్తున్నారు? ఇదేం జంతువబ్బా? అని ఆలోచిస్తున్నారా! మీకు ఒక టెస్ట్ పెడదామని ఈ వింత జీవిని మీ ముందుకు తీసుకొచ్చాం. దీన్ని బాగా పరిశీలించి ఇందులో ఏమేం జంతువుల శరీర భాగాలున్నాయో చెప్పాలి. మరి రెడీనా!

రైతుమిత్ర

పిల్లలూ... ఈ వారం చెప్పకోబోయే పక్షి పేరేంటో తెలుసా? నల్ల ఏట్రింత. దీన్ని మీరూ చూసే ఉంటారు. నల్లగా నిగనిగలాడుతూ చాలా చురుగ్గా ఉంటుంది. తోక చాలా పొడవుంటుంది. ఫోన్ తీగలమీద, చిన్న చిన్న చెట్లమీద, పంట పొలాల్లో వాలుతుంది. చిన్ని పక్షి అయితేనేం! ఓ చక్కటి పని చేస్తుంది. అదేంటో తెలుసా... పంటలను పాడుచేసే అనేక రకాల కీటకాలను చంపేసి, రైతులకు సహాయం చేస్తుంది. ఇంక దీని అరుపు హుంకరిస్తున్నట్లు గట్టిగా, రకరకాలుగా ఉంటుంది. ఈ జాతిలో మరో రెండు రకాల పక్షులున్నాయి. అవేంటంటే... ఒకటి బూడిదరంగు ఏట్రింత. దీని కళ్ళు ఎర్రగా ఉంటాయి. ఇది అడవుల్లో మాత్రమే కనిపిస్తుంది. రెండో రకం తెల్లపొట్ట ఏట్రింత. దీని శరీరం పైభాగం ముదురు నీలిరంగులో, పొట్ట తెల్లగా ఉంటుంది. మిగతా రెండింటికంటే ఇది చిన్నగా ఉంటుంది.

త్రిభుజాలెన్ని?



ఫ్రెండ్స్... పక్కన కొన్ని త్రిభుజాలున్నాయి. అవి మొత్తం ఎన్నున్నాయో లెక్కించి చెప్పాలి. అయితే ఎక్కువ సమయం తీసుకోకూడదు సుమా.

మంట ఎటువైపు?

వెలిగే కొవ్వొత్తి పట్టుకుని ముందుకు నడిచేటప్పుడు మంట వెనక్కి వంగుతుంది. అదే కొవ్వొత్తిని ఒక గాజు పెట్టెలో పెట్టి నడిచినప్పుడు, గుండ్రంగా తిరుగుతున్నప్పుడు ఎటు వైపు వంగుతుందో తెలుసా?



<u>జవాబు</u> : కొవ్వొత్తిని ఒక గాజు పెట్టెలో పెట్టి నడిచినప్పుడు మంట ముందుకు వంగుతుంది. ఎందుకంటే చుట్టూ ఉన్న గాలి కంటే ఎదురుగా ఉన్న గాలి పల్చగా, తేలికగా ఉంటుంది. బలాన్ని ప్రయోగించినప్పుడు బరువైన కణాలకంటే ఇవి ఎక్కువ వేగంగా కదులుతాయి. అందువల్ల ముందుకు వెళ్లేటప్పుడు దానిలోని గాలికంటే ఎక్కువ వేగం పొందిన మంట ముందుకు వంగుతుంది. చుట్టూ ఉన్న గాలికంటే మంట సాంద్రత తక్కువగా ఉంటుంది. గుండ్రంగా తిప్పినప్పుడు గాలి కంటే తేలికగా ఉన్న మంట పైకి తేలుతుంది.

చుక్కలు కలుపుదాం

నేస్తాలు! ఇక్కడ చుక్కల్లో ఎవరు దాక్కున్నారో తెలియాలంటే 1 నుంచి 82 వరకు చుక్కలు కలిపి చూడండి.



పూబాల

హాయ్... ఈ రోజు పువ్వుతో అమ్మాయిని చేయడమెలాగో నేర్చుకుందామా? దీన్ని చేసి ఇంట్లో పెద్దవాళ్లకి, స్నేహితులకి చూపించండి. భలే చేశావే అని ఆశ్చర్యపోతారు. చేయడం కూడా చాలా తేలిక. పది నిమిషాల్లో అయిపోతుంది. దీనికి కావలసిన వస్తువులు కూడా మన ఇంట్లో దొరికేవే.

ఏమేం వస్తువులు కావాలంటే...

ఇంట్లోనో, ఇంటి చుట్టుపక్కనో పూల చెట్లుంటాయి కదా. అలాంటి వాటిలో ఐదారు రేకులున్న పెద్ద పువ్వు, నలుపు ఎరుపు స్కెచ్ పెన్నులు, గమ్ కావాలి. అంతే!

ఎలా తయారు చేయాలంటే...

పెద్ద రేకులున్న పువ్వుని కాడతో తీసుకోవాలి. మధ్య భాగం నుండి రేకులని వెనక్కి వంచాలి. ఇలా వంచితే రేకులు విరిగిపోతాయి కదా అంటున్నారా. అందుకే గమ్‌తో వాటిని ఊడిపోకుండా అతికించాలి. మధ్య భాగం కొంచెం పెద్దగా, గుండ్రంగా ఉంటుంది కదా. దానిమీద అమ్మాయి కళ్లు, నోరు, ముక్కు స్కెచ్ పెన్నుతో గీయాలి. ఇప్పుడు చూడండి. అచ్చంగా రంగురంగుల గౌను వేసుకున్న అమ్మాయిలా ఉంది కదా. కాకపోతే ఇది కొద్ది సేపే ఉంటుంది. పువ్వు కదా త్వరగా వాడిపోతుంది. కానీ చాలా అందంగా ఉంటుంది.

ఆహ్వానం

హాయ్ నేస్తాలూ! మీరు కథలు, కవితలు, బాగా రాస్తారట కదా. జోక్స్ బొమ్మలు, సూపర్‌గా వేస్తారట. మీకు బోలెడన్ని తమాషా ప్రశ్నలు - జవాబులు, చారిత్రక ఘట్టాలు తెలుసంట కదా. మరి అవన్నీ ఎంచక్కా పోస్టు కార్డుమీద రాసి పంపండి. మీ పేరు, స్కూల్‌తో సహా ప్రచురిస్తాం.

<u>మా చిరునామా</u>

బాలనేస్తాలు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజమాబాద్,
ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500020.

ఎక్కడున్నాయబ్బా...

చిన్నారులూ... కింద ఆంగ్ల అక్షరాల సమూహం ఉంది. అందులో కొన్ని పదాలు దాగున్నాయి. ఆ పదాలేంటో పక్కన ఇచ్చాం. అవి అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఎలాగైనా ఉండొచ్చు. ఇప్పుడు మీరు వాటిని వెతికి పట్టుకోవాలి.

animal
astronaut
doctor
dog
health
human
love
military
pet
research
treat
woman

H	E	A	L	T	H	H	D	U	A	Q	Z
A	P	E	X	E	D	A	F	A	T	A	V
J	T	U	A	N	O	R	T	S	A	R	Y
S	K	A	Y	A	C	I	B	T	E	E	R
L	O	V	E	M	T	A	S	A	S	S	A
A	J	A	D	U	O	L	S	C	P	E	T
M	G	O	D	H	R	A	A	V	U	A	I
I	A	G	T	A	E	R	T	A	I	R	L
N	A	Q	A	H	A	P	A	D	P	C	I
A	W	O	M	A	N	A	M	S	L	H	M

16తో ...

ఫ్రెండ్స్... కింద16 చతురస్రాలున్నాయి కదా. వాటిలోంచి తొమ్మిది అగ్గిపుల్లలు తీసేసి ఒక్క చతురస్రం కూడా లేకుండా చేయాలి. అయితే ఎక్కువ సమయం తీసుకోకూడదు మరి. త్వరగా చెప్పేయాలి సరేనా.



జవాబులు

16తో...:



త్రిభుజాలెన్ని? : 27

మాటల కోట - 71

రూపకల్పన : కర్లపాలెం

■	1	2		3		4		■
5	■		■		■		■	6
7		■	8			■	9	
	■	10	■		■	11	■	
12				■	13			
	■		■	14	■		■	
15	16	■	17			■	18	
■		■	19		■	■		■
■	20							■

అడ్డం :

1. రామారావు భీముడు - సావిత్రి ద్రౌపది. చిత్రం పేరు? (7)
7. గుడ్డు కాని గుడ్డు, ఉండే శరీరభాగం (2)
8. గంగ, యమున, సరస్వతి సంగమం (3)
9. హా..., ఇది ఎంత సుఖం (2)
12. అద్వానీ అనగానే గుర్తొచ్చే యాత్ర (4)
13. తలకింది గడ (4)
15. అణా అంచు అరిగిపోయి తిరగబడింది (2)
17. తెలుగువారి చెడుగుడు (3)
18. మూడొంతులు ఆవాలు (2)
19. 'లాలి'కి ముందు 'నిద్ర'కి చివర (2)
20. మోహన్ దాస్ తండ్రి (7)

నిలువు :

2. ....కు లోకం దాసోహం (2)
3. తమిళ హాస్య నటుడు. వడిగా చెప్పండి (4)
4. ఎడమచేయి. హస్తం లేకుండా (2)
5. తిరుపతిలోనూ, ముళ్లపూడిలోనూ ఉండే రమణ (6)
6. విశ్వనాథ వారి సహస్రఫణులు (6)
10. మాయలు నేర్చిన వాడు (3)
11. బావి కప్పే (3)
14. కింద నుండి పైకొచ్చిన మాజీ ముఖ్యమంత్రి (4)
16. కోపం (3)
17. మాజీ రాష్ట్రపతి అబ్దుల్.... (3)

మాటలకోట - 70 జవాబు

1 బ	ళ్లా	2 రి	■	3 అ	మ	ర్	సిం	4 గ్
లి	■	5 ల	క్ష్మీ	■	■	■	■	కా
■	■	య	■	6 ఎ	ద్యూ	ర	ప్ప	■
7 ఎ	■	స్స్	■	డ	■	■	■	■
మ్మా	■	■	■	8 టు	నో	కు	టు	9 ఓ
10 ర్	11 వా	ప	■	బా	■	■	■	బు
■	రెం	■	12 బ్ర	■	■	13 హ	వా	లా
14 వే	టు	■	హ్మ	■	15 రా	జా	■	పు
లం	■	16 వా	డి	■	17 వు	రే	■	రం

హ్హా... హ్హా...

తుప్పు

సింగారావ్: ఏవండీ డాక్టర్ గారూ నేను కొద్దిరోజులుగా ఐరన్ టానిక్ తీసుకుంటున్నాను కదా.

డాక్టర్: అవును. అయితే ఏంటట!!

సింగారావ్: లోపల పేగులు అవి తుప్పు పడతాయేమోనని బెంగగా వుందండీ.

జేబులు

పోలీసు: ఏంటయ్యా! నా ప్యాంటుకు, షర్టుకు జేబులు కుట్టలేదేంటి?

దర్జీ: పొండి సార్! పోలీసులు ఎక్కడైనా సొంత జేబుల్లోంచి డబ్బులు తీసి ఖర్చు చేస్తారా?

-వీరేంద్ర, ఒమ్మెవరం.



శుభాకాంక్షలతో...
ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి
రాష్ట్ర ముఖ్యమంత్రి
బొత్స సత్యన్నారాయణ
పిసిసి అధ్యక్షులు,
ఆంధ్రప్రదేశ్
పద్మభూషణ్ చిరంజీవి
కాంగ్రెస్ పార్టీ
రాష్ట్ర నాయకులు
ధర్మాన ప్రసాదరావు
రోడ్లు, భవనాల
శాఖామాత్యులు
కిల్లి కృపారాణి
ఎంపీ మరియు డిసిసి
అధ్యక్షురాలు, శ్రీకాకుళం
ప్రజారాజ్యం పార్టీ, కాంగ్రెస్ పార్టీల విలీనం ఈ రాష్ట్రంలో
ఒక బలమైన శక్తిగా ఎదగాలని, మన రాష్ట్ర ప్రజలకు
సామాజిక న్యాయం జరగాలని మరియు రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి
సాధించాలని మనసా, వాచ, కర్మేనా కోరుతూ...
ఇట్లు...
మీ
వంక నాగేశ్వరరావు
జిల్లా కాంగ్రెస్ నాయకులు, పలాస, శ్రీకాకుళం జిల్లా

నఖ సుందరి

వావ్...ఏంటవి...గోళ్లా...తాళ్లా...అని తెగ ఆశ్చర్యపోతున్నారా?! మరి అంత పొడవు గోళ్లను చూసి అంతలా ఆశ్చర్యపోవడంలో ఆశ్చర్యంలేదులెండి. విశేషం ఏమంటే...ఈ గోళ్ల వల్లే ఆవిడ గిన్నిస్‌బుక్-2012 లోకి కూడా ఎక్కేసింది. ఈ నఖ సుందరి పేరు క్రిస్ వాల్టన్. న్యూయార్క్ వాసి. గత పద్దెనిమిది సంవత్సరాలుగా గోళ్లను కత్తిరించకుండా పెంచుకుంటోంది. కుడి చేతి గోళ్ల పొడవు సింపుల్‌గా 9 అడుగుల 7 అంగుళాలు. ఎడమ చేతి గోళ్ల పొడవు 10 అడుగుల 2 అంగుళాలు. ఈ గోళ్లను ఇలా పెంచుకోవడం, ఫొటోలకు ఫోజులివ్వడం అంతా బానే వున్నా చాలా సమస్యలూ వున్నాయండోయ్. జేబులోంచి సెల్‌ఫోన్ తియ్యడం కూడా కష్టమే. ఇంటి పనులు చేయడం మరింత కష్టం. ఫోన్ నెంబర్ నొక్కాలన్నా కష్టమే. అన్నీ కష్టాలేనండీ. అన్ని కష్టాలను ఇష్టంగా భరిస్తోంది కాబట్టే గిన్నిస్ బుక్ ఎక్కింది మరి.

'అయినా... పని పాటా చెయ్యడానికి లేకుండా ఇదేం చోద్యమమ్మా!' అంటారా!

'పుర్రెకో బుద్ధి' అని పెద్దలు ఊరకే అన్నారా!